నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY



సంపుటి : 13 సంచిక : 190 రంగారెడ్డి | గురువారం 12 నవంబర్ 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 12-11-2026 November | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy-Siddipet-Medchal-Jagityal-Vemulawada

‘మోడీని గద్దె దించడమే కాంగ్రెస్ లక్ష్యం’..

సీఎం రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు



నిర్భయవార్త ప్రతినిధి
:హైదరాబాద్:

దేశంలో మైనార్టీలకు ఇచ్చే స్కాలర్‌షిప్స్ కూడా బీజేపీ రాజకీయం చేస్తోందని సీఎం రేంత్ రెడ్డి ప్రశ్నించారు. బుధవారం బంజారా హిల్స్‌లో ఉన్న బంజారా భవన్‌లో జాతీయ విద్యా, మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం మైనారిటీలకు అన్ని వేళలా, అన్ని రకాలుగా పూర్తి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. దేశంలో విద్యా, నీటిపారుదల రంగాలకు తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. నాడు నెహ్రూ వేసిన బలమైన పునాదుల వల్లే నేడు విద్యా, ఇరిగేషన్ రంగాల్లో దేశం గొప్ప వృద్ధిని సాధించిందన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను తొలి విద్యా శాఖ మంత్రిగా నియమించి, దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన యూనివర్సిటీలు, ఐఐటీలను కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆనాడు పడిన పునాదుల ఫలితంగానే నేడు భారతీయ యువత ప్రపంచ ప్రఖ్యాత సంస్థలకు సీఈవోలుగా ఎదుగుతున్నారని, ఈ విషయాన్ని నేటి యువత (మిగతా 3లో..)

రైతులకు చౌకగా ఎరువులు

ఎరువుల సబ్సిడీకి భారీగా నిధులు... కేంద్ర కేబినెట్ కీలక ప్రకటన



ఢిల్లీ:
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం (కేబినెట్) పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. దేశంలో వ్యవసాయ రంగానికి అండగా నిలవడంతో పాటు పారిశ్రామికాభివృద్ధి, స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు భారీ ఎత్తున నిధులను మంజూరు చేస్తూ మంత్రివర్గం కీలక ప్రకటన చేసింది.

రబీ సీజన్ ఎరువుల సబ్సిడీకి రూ.62,370 కోట్లు

2026-27 రబీ సీజన్‌కు (అక్టోబర్ 1, 2026 నుండి మార్చి 31, 2027 వరకు) సంబంధించి ఫాస్ఫేట్, పొటాషియం (పీఅండ్‌కే) ఎరువులపై పోషకాధారిత సబ్సిడీ రేట్లను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. దీని కోసం అంచనా బడ్జెట్‌గా సుమారు రూ.62,370.02 కోట్లను కేటాయించింది. గత 2025-26 రబీ సీజన్‌లో ఎరువుల సబ్సిడీ బడ్జెట్ రూ.37,952.29 కోట్లుగా ఉండగా, ఈసారి అంతకంటే సుమారు రూ.24,417.73 కోట్లు అదనంగా కేటాయించడం విశేషం. (మిగతా 3లో..)

తెలంగాణలో రెండోసారి ‘భారత్ సమ్మిట్’..

ప్రపంచ పరిస్థితులపై చర్చలు: సల్మాన్ ఖుర్షీద్





హైదరాబాద్, నవంబర్ 11: తెలంగాణలో రెండోసారి ‘భారత్ సమ్మిట్’ జరుగుతోందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ విదేశీ వ్యవహారాల విభాగం చైర్మన్ సల్మాన్ ఖుర్షీద్ తెలిపారు. బుధవారం హెచ్‌ఐసీసీలో మీడియాతో మాట్లాడుతూ.. భారత్ సమ్మిట్ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ప్రపంచంలో ఉన్న పరిస్థితులపై సమ్మిట్‌లో చర్చించనున్నట్లు చెప్పారు. దేశాల మధ్య కోఆర్డినేషన్ కోసం సమ్మిట్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపా రు. గాంధీ సిద్ధాంతాలు ఈ దేశానికి అవసరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మానవ త్వం పెంపొందేలా భారత్ సమ్మిట్ కొనసాగుతుందని వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రోగ్రెసివ్ భావాలున్న వారిని సదస్సుకు ఆహ్వానించామని సల్మాన్ ఖుర్షీద్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఐడియాలజీ ప్రపంచానికి దిక్సూచి: భట్టి

‘భారత్ సమ్మిట్’కు 70 దేశాల నుంచి 1000 మంది ప్రతినిధులు వస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సమ్మిట్‌కు వస్తున్న ప్రతినిధులకు స్వాగతం తెలిపారు. భారత్ సమ్మిట్‌ను తెలంగాణలో జరపడం గౌరవంగా ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా విభజన రాజకీయాలు, విద్వేష రాజకీయాలు కొనసా గుతున్నాయని తెలిపారు. తాము గాంధీ పాటించిన అహింస సిద్ధాంతాన్ని పాటిస్తున్నామని చెప్పారు. నెహ్రూ ప్రతిపాదించిన అలీన విధానం ఎంతగానో ఉపయోగపడిందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ఐడియాలజీ ప్రపంచానికి దిక్సూచిగా పనిచేస్తుందని వెల్లడించారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాల చర్చకు భారత్ సమ్మిట్ ఉపయోగపడుతుందని భట్టి విక్రమార్క తెలిపారు.

అదే కాంగ్రెస్ తపన: మంత్రి శ్రీధర్ బాబు

బీజేపీ ఆలోచన వేరని.. ప్రగతిశీల ఆలోచనలు ఉన్న కాంగ్రెస్ ఆలోచన వేరని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మోదీ తర్వాత ఎవరిని లాంచ్ చేద్దామని బీజేపీ ఆలోచిస్తోందన్నారు. ప్రపంచంలో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపడమే కాంగ్రెస్ తపనగా చెప్పుకొచ్చారు. భారత్ సమ్మిట్ ఒక ఎకనామిక్ సమ్మిట్‌లాగా ఉపయోగపడుతుందన్నారు. ఈ సమ్మిట్ రాజకీయాల కోసం కాదని అన్నారు. బీజేపీ అనవసర విమర్శలు మానుకోవాలని హితవుపలికారు. భారత్ సమ్మిట్‌కు రాహుల్ గాంధీని ఆహ్వానిస్తే తప్పేంటని నిలదీశారు. టెక్నాలజీ, ప్రస్తుత సవాళ్లపై ఎవరైనా మాట్లాడొచ్చన్నారు. ప్రగతిశీల భావాలున్న ప్రతిపార్టీని సమ్మిట్‌కు ఆహ్వానించామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితులపై చర్చిస్తామన్నారు. అలాగే జెన్‌జీ డిమాండ్లపై కూడా ఒక సెషన్‌లో చర్చించనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

ప్రజాస్వామ్యంపై నమ్ముకున్న వాళ్లు పాల్గొంటారు: మహేశ్

విదేశాల నుంచి భారత్ సమ్మిట్‌కు వస్తున్నారని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సదస్సులో పాల్గొంటారని చెప్పారు. ప్రపంచంలో జరుగుతున్న అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యంపై నమ్ముకున్న వాళ్లు భారత్ సమ్మిట్‌లో పాల్గొంటారని మహేశ్ కుమార్ వెల్లడించారు.

జూనియర్ కాలేజీ లెక్చరర్లకు సీఎం రేవంత్ రెడ్డి భరోసా..

ఉద్యోగ భద్రతపై కీలక ప్రకటన



నిర్భయవార్త ప్రతినిధిహైదరాబాద్:

తెలంగాణ విద్యాశాఖపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని, రాబోయే విద్యా సంవత్సరం నుంచి 10+2 విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్తు ప్రయోజనాలే లక్ష్యంగా ఈ విద్యా సంస్కరణలు రూపుదిద్దుకుంటున్నాయని స్పష్టం చేశారు. (మిగతా 3లో..)

సామాన్యుడి నెత్తిన మరో పిడుగు..

భారీగా పెరిగిన పాల ధరలు.. ఇవాళ్టి నుంచే అమల్లోకి



ఢిల్లీ:నిర్భయవార్త ప్రతినిధి

నిత్యావసరాల ధరల మోతతో ఇప్పటికే సతమతంఅవుతున్న సామాన్యుడికి మరో షాక్ తగలబోతోంది. ప్రముఖ పాల సరఫరా సంస్థ ‘మదర్ డెయిరీ’ పాల ధరలను పెంచింది. లీటరుకు రూ.2 నుంచి రూ.4 వరకు పెంచుతున్న ట్లు ప్రకటించింది. పెరిగిన ఈ కొత్త ధరలు గురువారం (నవంబర్ 12) నుంచి అమల్లోకి రానున్నాయి. రైతుల నుంచి పాలు సేకరించే ఖర్చులు, ఇతర ముడిసరుకు వ్యయాలు పెరగడం వల్లే ధరలను సవరించాల్సి వచ్చిందని మదర్ డెయిరీ పేర్కొంది.

లీటర్ పాలు రూ.76: ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో అతిపెద్ద పాల సరఫరాదారుగా ఉన్న మదర్ డెయిరీ గతంలో 2026 మే 14న పాల ధరలను పెంచింది. అంతకుముందు 2025 ఏప్రిల్‌లో ధరలను సవరించింది. పాల అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంలో 75 నుంచి 80 శాతం వరకు రైతులకే చెల్లిస్తున్నామని ప్రస్తుతం సేకరణ ధరలు పెరగడంతో ఆ భారంలో కొంత భాగాన్ని వినియోగదారులపై మోపాల్సి వచ్చిందని సంస్థ వర్గాలు తెలిపాయి.

పెరిగిన కొత్త ధరల వివరాలు (ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో):

ఫుల్ క్రీమ్ మిల్క్ (ప్యాకెట్): లీటరు రూ. 72 నుంచి రూ. 76కు పెరిగింది. ఆవు పాలు: రూ. 62 నుంచి రూ. 65కు చేరింది. టోన్డ్ మిల్క్ (ప్యాకెట్): రూ. 60 నుంచి రూ. 62కు పెరిగింది. టోన్డ్ మిల్క్ (బల్క్ వెండెడ్/లూజ్): రూ. 58 నుంచి రూ. 60కి పెరిగింది. డబుల్ టోన్డ్ మిల్క్: రూ. 54 నుంచి రూ. 56కు చేరింది.

రోజుకు 50 లక్షల లీటర్లు:

మదర్ డెయిరీ దేశవ్యాప్తంగా రోజుకు 50 లక్షల లీటర్లకు పైగా పాలను విక్రయిస్తుండగా, కేవలం ఢిల్లీ-ఎన్సీఆర్ మార్కెట్లోనే రోజుకు సుమారు 35 లక్షల లీటర్ల పాలను విక్రయిస్తోంది. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ అనుబంధ సంస్థగా 1974లో ప్రారంభమైన మదర్ డెయిరీ.. గత ఆర్థిక సంవత్సరంలో 17 శాతం వృద్ధితో రూ.20,300 కోట్ల టర్నోవర్‌ను సాధించింది. ఈ సంస్థ ‘మదర్ డెయిరీ’ బ్రాండ్ పేరుతో పాలు, ‘ధార’ పేరుతో వంటనూనెలు, ‘సఫల్’ పేరుతో పండ్లు, కూరగాయలను విక్రయిస్తోంది.

పుట్టిన ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నిర్భయవార్త ప్రతినిధి :హన్మకొండ:

తెలంగాణ బిడ్డలు ప్రపంచాన్ని శాసించేలా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం కాజీపేటలో పర్యటించిన డిప్యూటీ సీఎం.. తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ (మిగతా 3లో..)

‘బోగస్ మాటలతో ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్’..

సమస్యల కంటే వాళ్లకు నా గడ్డం మీదనే ఫికర్ ఉంది: కేటీఆర్

నిర్భయవార్త ప్రతినిధి :
నిర్మల్:



నిర్మల్‌లో బీఆర్ఎస్ బుధవారం రైతు గర్జన సభ ఏర్పాటు చేసింది. ఈ సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. సరస్వతి మాత కొలువున్న పుణ్యభూమి నిర్మల్ అని వ్యాఖ్యానించారు. ఈ చారిత్రక స్థలానికి కేసీఆర్ ఉద్యమానికి అవినాభావ సంబంధం ఉందని, తెలంగాణ వస్తుందని మొదట చెప్పింది ఇక్కడేనని అన్నారు. 1996లో కేసీఆర్ ఇక్కడ నుండే ప్రాజెక్టుల గురించి మాట్లాడారని చెప్పారు. రాష్ట్రం ఏర్పడగానే కేసీఆర్ 46వేల చెరువులకు జీవం పోశారని అన్నారు. కాంగ్రెస్ వాళ్లు కేసీఆర్ కంటే ఎక్కువ ఇస్తామని ప్రచారం చేశారని, అడ్డగోలు అబద్ధపు హామీలు ఇచ్చారని మండిపడ్డారు. ఆంధ్రాకు నీళ్లు.. తెలంగాణకు ఎక్కిళ్లు ఎందుకు అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు అరచేతిలో వైకుంఠం చూపించి బోగస్ మాటలతో ఓట్లు వేయించుకున్నారని అన్నారు. 700 కి.మీ చంద్రబాబు నీళ్లు పారించారని చెప్పారు. తెలంగాణలో మాత్రం చెరువులు ఎండిపోతున్నాయని తెలిపారు. గోదావరి పారే నిర్మల్‌లో కరువు ప్రకటన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ప్రజల దృష్టి మరల్చేందుకే కరువు పేరుతో ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. (మిగతా 3లో..)

నిర్భయవార్త

సంపాదకీయం


గురువారం 12 నవంబర్ 2026

నెతన్యాహుకు చెంపపెట్టు

ప్రపంచంలోనే అత్యంత నరహంతక పాలన సాగించిన బెంజమిన్ నెతన్యాహూకు ఇజ్రాయిల్ ఫలితాలు, అనంతర పరిణామాలు చెంపపెట్టు లాంటివి. క్నెసెట్ (పార్లమెంట్)లో 120 స్థానాలకు గాను 53 స్థానాలకే ఆయన నేతృత్వంలోని కూటమి చతికిలబడటం విశ్వవ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామ్య వాదులకు కొత్త ఆశలు చిగురింపజేసింది. ఎంతటి నియంతలైనా మట్టి కరవాల్సిందేనని ఆ దేశ ప్రజలు ఓటు ద్వారా తీర్పు ఇచ్చారు. తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపక్ష నాయకుడు గాడి ఐసెన్‌కోట్‌ను ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ ఆహ్వానించడం ఆ తీర్పును గౌరవించడమే. నెతన్యాహు విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రచారం చేసిన మాజీ సైనిక అధిపతి ఐసెన్ కోట్ నేతృత్వంలోని యషర్ పార్టీ 21 ఎంకెలతో రెండో స్థానంలో నిలిచినా, ఆయన నేతృత్వంలోని కూటమి 120 మంది సభ్యులున్న పార్లమెంట్‌లో 48 స్థానాలను పొందగలిగింది. రికార్డు స్థాయిలో 19 స్థానాలు సాధించిన అరబ్ పార్టీలు మద్దతు ప్రకటించడంతో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 67 మంది సభ్యుల సంఖ్యాబలం లభించింది. నెతన్యాహూ నేతృత్వంలోని లికుడ్ పార్టీ 27 స్థానాలతో పెద్ద పార్టీగా, ఆయన నాయకత్వంలోని కూటమి 53 స్థానాలు సాధించినా... ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం లభించే అవకాశం లేదు. తన కూటమిలో ఏడు స్థానాలు పొందిన యునైటెడ్ తోరా జూడాయిజం పార్టీ మద్దతు తెలిపేందుకు చివరి నిమిషంలో నిరాకరించడం, మొత్తంగా 46 మందే మద్దతు ప్రకటించడం.. సొంత ఇంటిలోనే రాజుకున్న కుంపటికి నిదర్శనం. అరబ్ పార్టీలను తీవ్రవాద పార్టీలుగా దూషిస్తూ, యూదు పార్టీలన్నీ ఏకం కావాలంటూ తన ఏలుబడిని కొనసాగించేందుకు వేస్తున్న ఎత్తుగడలు, ఆయన వెనుక ఉన్న ట్రంపునూ తక్కువ అంచనా వేయలేం. 1948లో ఇజ్రాయిల్ ఏర్పడిన తర్వాత జరిగిన యుద్ధం అనంతరం అక్కడే ఉండిపోయిన పాలస్తీనియన్లు, వారి వారసులతో కలిసి నేడు దేశ జనాభాలో 20 శాతం కంటే ఎక్కువ మంది ఉన్నారు. వారికి ఓటు హక్కుతో సహా ఇజ్రాయెల్ పౌరసత్వం ఉంది. గాజా, వెస్ట్ బ్యాంక్‌లోని పాలస్తీనియన్ల పట్ల వారికి సహజంగానే ఉన్న సంఘీభావాన్ని బూచిగా చూపుతూ ఉగ్రవాదులుగా, దేశ వ్యతిరేకులుగా నెతన్యాహూ నేతృత్వంలోని కూటమి ప్రచారం చేసింది. యూదులు, అరబ్బులు కలిసి సహజీవనం చేయాలన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించి, పచ్చి మితవాదాన్ని రెచ్చగొట్టి సమాజాన్ని రెండుగా చీల్చేసింది. 19 ఏళ్లపాటు ఏలుబడి సాగించిన నెతన్యాహూ గాజాలోని చిన్నారులు, మహిళలు సహా 75 వేల మందికిపైగా పాలస్తీనియన్లను ఊచకోత కోయించి, లక్షలమందిని క్షతగాత్రులుగా, అన్నార్తులుగా మార్చేసిన నరహంతకుడిగా, యుద్ధ నేరస్తుడిగా ప్రపంచ ప్రజల చీత్కారానికి గురయ్యాడు. అత్యంత అవినీతిపరుడిగా, సుప్రీంకోర్టు అధికారాల్ని చేజిక్కించుకునేందుకు ప్రయత్నించిన నాయకుడిగా దేశంలో వ్యతిరేకతను ఎదుర్కొన్నాడు. ఇజ్రాయిల్‌ను అంధకారంలోకి, అగాధంలోకి నెతన్యాహు నెట్టేశాడన్న విశ్లేషణ అక్షరసత్యం. గాజా, ఇరాన్ యుద్ధాలకు, ఘోరాలకు సహకారం అందించి, అంతులేని సామ్రాజ్యవాద దురహంకారంతో ప్రపంచానికే కంటకప్రాయంగా నిలిచిన ట్రంప్‌నకు గోడ దెబ్బ.. చెంప దెబ్బలాగ... ఇజ్రాయిల్ ఫలితాలతోపాటు అమెరికా మధ్యంతర ఎన్నికల రిజల్ట్ ఉండటం గమనార్హం. నెతన్యాహు మితవాద – మత కూటమిని అధికారంలోకి రాకుండా నిరోధించడానికి, ఐసెన్‌కోట్‌కు అరబ్ పార్టీలు సూత్రప్రాయంగా మద్దతు ప్రకటించాయి. వారు ప్రభుత్వంలో భాగమవుతారా లేక ఐసెన్‌కోట్‌ను మైనారిటీ ప్రభుత్వాన్ని నడపడానికి అనుమతించడం ద్వారా బయటి నుండి మద్దతు ఇస్తారా అనేది స్పష్టం కావాలి. నెతన్యాహు అదుపులేని సైనికవాదం ఇజ్రాయిల్‌ను అంతర్జాతీయంగా మరింత ఏకాకిని చేసింది. శత్రువులను అధికం చేసింది. అమెరికా ఫలితాలు బొప్పికట్టడంతో ట్రంప్ సైతం ఈ మారణహోమానికి మద్దతు ఇవ్వడం కష్టమే. తన పొరుగు ప్రాంతాలలో ఎదుర్కొంటున్న భద్రతా సవాళ్లను తీవ్రతరం చేసింది. మరింత హింసను ప్రేరేపించడం ద్వారానే ఈ సమస్యలకు పరిష్కారం అంటున్న నెతన్యాహు వైఖరిని ఇజ్రాయిల్ వాసులే ఈసడించుకుంటున్నారు. ఐసెన్‌కోట్ ఇజ్రాయిల్‌ను మళ్లీ గాడిలో పెట్టాలి. తన కూటమిలోనే ఉన్న వామపక్షాలు (ది డెమొక్రాట్స్) నేత యాయిర్ గోలన్ పిలుపునిచ్చినట్లు అరబ్ – యూదు ఐక్య ప్రభుత్వం ఏర్పాటు చేసి, సమాజంలోని అంతరాలను తగ్గించేందుకు, అంతర్గత గాయాలను మాన్పేందుకు దృష్టి సారించాలి. కొత్త ప్రభుత్వం అంతర్జాతీయ మధ్యవర్తిత్వంతో పాలస్తీనియన్లతో చర్చలు ప్రారంభించి, శాంతి మార్గాన్ని అనుసరించాలి. గాజా నుండి వైదొలగాలి. ఇజ్రాయిల్, పాలస్తీనా స్వతంత్ర దేశాలుగా ఉండాలన్న ప్రపంచ వైఖరి పట్ల, ఐరాస తీర్మానాల పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటించాలి. ఇజ్రాయిల్‌లో శాంతి ఆ దేశ పతనాన్ని నిలువరించడంతోపాటు అంతర్జాతీయ సామరస్యానికి పునాది. నరహంతక నెతన్యాహు ఆలింగనంతో మన ప్రధాని మురిసిపోయారు. మితవాదం, విభజనవాదాలు ప్రజల సమస్యలను పరిష్కరించలేవని, అలాంటి పాలకులకు సరైన సమయంలో ప్రజలు సమాధానం చెబుతారని మన దేశ పాలకులు గుర్తించాలి.

సామ్రాజ్యవాద దోపిడీ కొనసాగింపు కోసం...

పెట్టుబడిదారీ వ్యవస్థ నిలకడగా వృద్ధి సాధిస్తూ పోవాలంటే దానికి వెలుపలి నుంచి – అంటే పెట్టుబడిదారీ వృద్ధి క్రమానికి వెలుపలి నుంచి – ఉత్తేజపరచగల బాహ్య ప్రేరణ అవశ్యం. దీనికి కారణం ఉంది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఎప్పుడూ ఆకస్మిక పెరుగుదలను, ఆ వెంటనే ఆకస్మిక పతనాన్ని చవిచూస్తూ కొనసాగుతుంది. ఆ వ్యవస్థ పూర్తి సామర్థ్యం వినియోగంలోకి వచ్చిన అనంతరం అధికోత్పత్తి సమస్య తలెత్తుతుంది. ఆ తర్వాత అది ఎదుర్కొనే పతనం దానంతట అదే అంతం కాదు. అటువంటి పతనం నుంచి ఆ వ్యవస్థ తనంతట తానే కోలుకోజాలదు. అటువంటి పరిస్థితుల్లో తాను ఏర్పాటు చేసుకున్న ఉత్పత్తి పరికరాలలో, యంత్రాలలో కొంత భాగాన్ని తానే ధ్వంసం చేసుకుని ఉత్పత్తి సామర్థ్యాన్ని కుదించుకుని అధికోత్పత్తి సమస్య నుండి బైట పడేందుకు అది ప్రయత్నిస్తుందని మార్క్స్ భావించాడు. అయితే ఆ విధంగా పరికరాల్లో కొంత భాగాన్ని పనికిరాకుండా చేయడం వలన ఆ మేరకు పెట్టుబడిదారులు పెట్టే ఖర్చు తగ్గిపోతుంది. పర్యవసానంగా ఆ మేరకు డిమాండ్ కూడా తగ్గుతుంది. అందుచేత సమస్య నుండి బైట పడడానికి వీలు కాదు. అందుకే పెరిగిన ఉత్పత్తికి కావలసిన డిమాండ్‌ను తన వ్యవస్థకు వెలుపల నుంచి తెచ్చుకోడానికి పెట్టుబడిదారీ విధానం పూనుకుంటుంది. అప్పుడే తన లాభాల వేటను అది కొనసాగించగలుగుతుంది. ఈ 'వెలుపలి మార్కెట్ల' కోసం పూనుకునే క్రమమే అది సామ్రాజ్యవాద దశకు చేరుకోడానికి దారి తీసింది. ఈ విధంగా వెలుపలి మార్కెట్లను చేజిక్కించుకునే క్రమమే ఇతర దేశాలను వలసలుగా మార్చేందుకు దారి తీసింది. ఆ వలసలలో అంతవరకూ ఉండిన చేతివృత్తులను, పరిశ్రమలను ధ్వంసం చేయడానికి దారి తీసింది. ఆ వలస దేశాలలోని చేతివృత్తులు కాని, స్థానిక పరిశ్రమలు కాని నాశనం కావడానికి బైటనుంచి సామ్రాజ్యవాద దేశాలు తెచ్చి గుమ్మరించిన సరుకుల పోటీ కారణం కాదు. నిర్బంధం ప్రయోగించడం ద్వారా సామ్రాజ్యవాదులు వలస దేశాల్లో తమ సరుకులకు అనుగుణంగా ఉండే మార్కెట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అలా నిర్బంధాన్ని ప్రయోగించడానికి వాళ్ళకి ఆ వలస దేశాల మీద ఆధిపత్యం చెలాయించడం అవసరం అయింది. ఆ విధంగా తమ పెట్టుబడిదారీ వ్యవస్థకు వెలుపల ఉన్న ప్రాంతాల నుండి తమకు అవసరమైన 'ఉత్తేజపరచగలిగిన' ప్రేరణను పొందగలిగింది. దానితోబాటు అదనంగా ఆ ప్రాంతాల నుండి ఆహారధాన్యాలను, ముడి సరుకులను కూడా పొందగలిగింది. అయితే, పెట్టుబడిదారీ వ్యవస్థకు వెలుపల ఉండే ప్రాంతాలకు పెట్టుబడిదారీ వ్యవస్థను ఇలా ఉత్తేజపరచగలిగే సామర్థ్యం క్రమేణా ఇగిరిపోతుంది. ఒకసారి ఏదైనా ప్రాంతం పెట్టుబడిదారీ ఉత్పత్తులతో ఆక్రమించబడిన తర్వాత అక్కడ కూడా పెట్టుబడిదారీ పద్ధతుల్లో వృద్ధి ప్రారంభం అవుతుంది. అక్కడ ఉత్పత్తి అయ్యే సరుకులకు కూడా 'వెలుపలి' మార్కెట్ అవసరమౌతుంది. అంతవరకూ పెట్టుబడిదారీ–పూర్వపు దశలో ఉండిన ప్రాంతాల మార్కెట్లన్నీ ఇలా ఇగిరిపోయి ఇక కొత్త మార్కెట్లు అనేవి ఎక్కడా లేకుండా పోయిన దశ వచ్చినప్పుడు ఇక పెట్టుబడి పోగుబడే క్రమం ముందుకు సాగదు. అటువంటి పరిస్థితి ఏర్పడే లోపే శ్రామికవర్గం ఆ వ్యవస్థను కూల్చివేయగలదని రోసా లగ్సెంబర్గ్ అభిప్రాయపడ్డారు. జాన్ మేనార్డ్ కీన్స్ అనే ఇంగ్లీషు ఆర్థికవేత్త దీనికొక ప్రత్యామ్నాయాన్ని ముందుకు తెచ్చాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో అవసరమైన అదనపు డిమాండ్‌ను వెలుపలి నుండి పొందే బదులు రాజ్యమే పూనుకుని అదనపు ఖర్చు చేయడం ద్వారా ఆ డిమాండ్‌ను సృష్టించవచ్చునని ప్రతిపాదించాడు. రాజ్యం ఈ విధంగా చేయగల అదనపు ఖర్చును ఎప్పుడు అవసరమైతే అప్పుడు పెంచుకోవచ్చు, లేదా తగ్గించుకోనూవచ్చు. అటువంటి సర్దుబాటు చేయగల సామర్థ్యం ఉన్నప్పుడు ఇక పెట్టుబడిదారీ విధానం అధికోత్పత్తి సంక్షోభం తలెత్తకుండా నివారించగలుగుతుందని, అందువలన పెట్టుబడిదారీ వ్యవస్థ పతనాన్ని నివారించవచ్చునని చెప్పాడు. దాంతో చాలామంది ఆర్థికవేత్తలు ఇక పెట్టుబడిదారీ విధానం ఆర్థికంగా ఒడిదుడుకులను ఎదుర్కోనవసరం లేని విధంగా స్థిరంగా నిలదొక్కుకుంటుందని ఆశించారు. పెట్టుబడిదారీ వ్యవస్థను విమర్శించేవారు కూడా దాని ఆర్థిక వైరుధ్యాల ఊసు ఎత్తడం మాననుకుని ఆ వ్యవస్థ కొద్దిమంది మాత్రమే అంతకంతకూ ఎక్కువ సంపదను పోగేసుకుంటూ, ఎటువంటి సామాజిక బాధ్యతా లేకుండా ఎక్కువమందిని పేదరికంలోకి నెట్టడం వంటి నైతిక అంశాల మీదనే కేంద్రీకరించడం ప్రారంభించారు. అయితే ఈ విధంగా రాజ్యమే పెట్టుబడిదారీ వ్యవస్థకు కావలసిన ఆర్థిక ఉత్తేజాన్ని అందించి ప్రేరేపించడానికి కావలసిన అదనపు ఖర్చును చేయడం అనేది అన్ని సందర్భాల్లోను సాధ్యం కాదు. దేశంలోని సంస్థల మీద అదనపు పన్నులు విధించి తద్వారా సేకరించిన ఆర్థిక వనరులను ఖర్చు చేసినప్పుడు, లేదా ద్రవ్యలోటును పెంచినప్పుడు మాత్రమే ఇది ఉత్తేజాన్ని మార్కెట్‌కు ఇవ్వగలుగుతుంది. అలా కాక, కార్మికుల మీద అదనపు పన్నులను విధిస్తే, దాని వలన మార్కెట్‌ను ఉత్తేజపరచడం సాధ్యం కాదు. ఎందుకంటే, కార్మికులు ఎటు తిరిగీ వారి ఆదాయాలను దాదాపు పూర్తిగా ఎప్పటికప్పుడు ఖర్చు చేసేస్తూనే వుంటారు. ఆ ఆదాయాల్లో కొంత భాగాన్ని అదనపు పన్నుల రూపంలో ప్రభుత్వం సేకరించి తాను ఖర్చు చేయడం వలన మార్కెట్లో అదనంగా డిమాండ్ పెరిగేది ఏమీ ఉండబోదు. ఇక సంపన్నుల మీద పన్ను అదనంగా వేయడమో, ద్రవ్యలోటును పెంచడమో



చేయడం తప్ప మార్కెట్లో డిమాండ్‌ను పెంచడానికి వేరే దారులేమీ లేవు. కాని ఆ విధంగా తమ మీద అదనపు పన్నులను విధించడాన్ని పెట్టుబడిదారులు అంగీకరించరు. ఏదైనా అనివార్య పరిస్థితుల్లో, అది కూడా తాత్కాలికంగా మాత్రమే అందుకు వాళ్ళు తలొగ్గవచ్చు తప్ప తమ వద్ద నుండి ఎల్లకాలమూ ప్రభుత్వం ఆర్థిక వనరులను సేకరించే విధానాన్ని ఎన్నటికీ అంగీకరించరు. ద్రవ్యలోటును పెంచి ఖర్చు చేయడం కూడా వారికి అంగీకారం కాదు. పైగా ప్రపంచీకరణ అనంతరం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి బలపడిన తర్వాత కీన్స్ చేసిన ఈ సూచనలకు దాని నుండి పూర్తి వ్యతిరేకత వచ్చింది. అందుచేత ఇప్పుడు నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ మాంద్యంలో పూర్తిగా దిగబడిపోయి చిక్కుల్లో పడివున్నప్పుడు రాజ్యం ఆ పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడేందుకు ఏమీ చేయలేని పరిస్థితిలో ఉంది. నయా ఉదారవాద విధానాలు ఉనికిలోకి రాకముందు, అంటే బడా పెట్టుబడి ప్రధానంగా ఏ దేశానికి ఆదేశంలోనే వ్యవహరిస్తున్నప్పుడు, అంటే రాజ్యం హద్దుల్లోనే అది ఉన్నప్పుడు, రాజ్యానికి దానిని అదుపు చేయగల సామర్థ్యం కొంత మేరకైనా ఉండేది. ఇప్పుడు అది అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిగా కేంద్రీకృతం అయిన తర్వాత రాజ్యానికి ఆ సామర్థ్యం లేదు. అందుచేత కీన్స్ చెప్పిన పరిష్కారం ఇప్పుడు పని చేయదు. అంటే, ఇప్పుడు రాజ్యం ఏమీ చేయలేదని నిర్ధారించకూడదు. సైనిక వ్యయం పెంచడం వంటి విషయాల్లో రాజ్యం పాత్ర ఉంటుంది. అలా పెరిగే వ్యయం వలన అదనపు డిమాండ్ కూడా ఏర్పడవచ్చు. నాటో దేశాలన్నీ తమ సైనిక వ్యయాలను తమ తమ జిడిపిలలో 5 శాతం వరకూ ఉండేలా పెంచాలని ఇటీవల డొనాల్డ్ ట్రంప్ సూచించాడు. ఒక్క స్పెయిన్ మినహా ఏ ఇతర నాటో సభ్య దేశమూ ఈ సూచనను గట్టిగా వ్యతిరేకించినది లేదు. అయితే, వీటిలో ఏ దేశమూ ఈ అదనపు సైనిక వ్యయం కోసం తమ బడ్జెట్ల ద్రవ్య లోటును పెంచినదీ లేదు. అవన్నీ ప్రజల సంక్షేమ పద్దుల్లో కోతలు పెట్టి సైనిక వ్యయాన్ని పెంచేందుకు పూనుకున్నాయి. అందువలన మొత్తం మీద చూసినప్పుడు అదనపు డిమాండ్‌ను సృష్టించినది ఏమీ లేదు. అందువలన ఆర్థిక మాంద్యం నుండి బైటపడే దారి దొరికినదీ లేదు. మరి ఆర్థిక మాంద్యం నుండి బైట పడేందుకు నయా ఉదార పెట్టుబడిదారీ వ్యవస్థ ముందు ఉన్న దారి ఏది? డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీసుకున్న కొన్ని చర్యలను పరిశీలిస్తే మనకి సమాధానం దొరకవచ్చు. అలా పరిశీలించినప్పుడు లభించే సమాధానం ఒక్కటే. 'ఈ వ్యవస్థ తనను తానే మింగివేస్తోంది'! తక్కిన పెట్టుబడిదారీ దేశాల పట్ల సైతం అమెరికా వ్యవహరిస్తున్న విధానం అమెరికా ప్రయోజనాలకే పెద్ద పీట వేసేవిధంగా ఉంది. మరీ ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాల విషయంలో ఇది కనిపిస్తోంది. ఈ దేశాల మార్కెట్లు గతంలో పెట్టుబడిదారీ–పూర్వపు దశలో ఉన్న కాలంలో ఆ దేశాలను తమ వలసలుగా ఆక్రమించుకుని తద్వారా తమ మార్కెట్లకు కావలసిన అదనపు 'ఉత్తేజాన్ని' సంగ్రహించాయి సామ్రాజ్యవాద దేశాలు. ఇప్పుడు దాని స్థానంలో అత్యంత సంపన్న పెట్టుబడిదారీ దేశాలు సాపేక్షంగా వెనుకబడ్డ మూడవ ప్రపంచ దేశాల మార్కెట్లను కబళించి అదనపు 'ఉత్తేజాన్ని' పొందేందుకు సిద్ధమయ్యాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో సాధారణ నియమం ప్రకారం పెట్టుబడిదారీ దేశాలన్నీ మార్కెట్ల కోసం పరస్పరం పోటీ పడతాయి. ఇది నిరంతరాయంగా సాగే పోటీగా ఉంటుంది. ఈ పోటీ ఉండడం న్యాయమే కదా అని అనుకునేవారు ఉన్నారు. ఇటువంటి పోటీకి, సామ్రాజ్యవాదానికి సంబంధం లేదని అనుకుంటారు వారు. కాని అది పూర్తిగా పొరపాటు అభిప్రాయం. వాస్తవానికి అటువంటి న్యాయమైన పోటీయే గనుక ఉండినట్లైతే ఇప్పుడు మూడవ ప్రపంచ దేశాలు అమెరికాను ఆ పోటీలో వెనక్కి నెట్టివేసి తాము ముందుకు దూసుకుపోగలిగిన స్థితిలో ఉన్నాయి (అమెరికన్ ప్రభుత్వం భారీ సబ్సిడీలు అందించిన రంగాలలో తప్ప– అంటే తమ దేశపు రైతులకు అందించే భారీ సబ్సిడీల వంటివి). అందుచేత ఇప్పుడు అమెరికా తన దేశానికి వెలుపల ఉన్న మార్కెట్లను బలవంతాన, నిర్బంధంగా చేజిక్కించుకోడానికి పూనుకుంటోంది. ఇలా బలవంతం చేసేందుకు అమెరికా రెండు పద్ధతులను ఉపయోగిస్తోంది. మొదటిది 'ఏకపక్ష సుంకాలు (వన్ వే టారిఫ్స్). అంటే, తన దేశంలోకి మూడవ ప్రపంచ దేశాల నుండి వచ్చే సరుకులమీద అమెరికా సుంకాలను పెంచుతోంది. అదే సమయంలో ఆ మూడవ ప్రపంచ దేశాలలోకి తాను పంపే సరుకుల మీద పన్నులను పెంచకూడదంటూ ఆంక్షలు విధిస్తోంది. ఇక రెండవ పద్ధతి 'బలవంతపు దిగుమతులు' (వన్ వే ఇంపోర్ట్ ఆబ్లిగేషన్స్). ప్రతీ మూడవ ప్రపంచ దేశమూ అమెరికా నుండి తప్పనిసరిగా, తనకు అవసరం ఉన్నా లేకపోయినా, దిగుమతులు చేసుకోవలసిందేనంటూ ఆ దిగుమతుల లక్ష్యాలను అమెరికాయే ఏకపక్షంగా నిర్ణయిస్తోంది. కాని అదే సమయంలో తాను ఆ మూడవ ప్రపంచ దేశం నుండి దిగుమతి చేసుకునే సరుకుల పరిమాణానికి నిర్దిష్ట లక్ష్యం అంటూ ఏమీ లేదు. అమెరికా–ఇండియా కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందంలో ఈ రెండు అంశాలూ ఉన్నాయి. అయితే ఆ ఒప్పందాన్ని ఇటీవల అమెరికా లోని ఒక కోర్టు కొట్టివేసింది. అందుచేత మళ్ళీ మరొక దఫా చర్చలు జరుగుతున్నాయి. ఒప్పందం దాదాపు పూర్తి కావచ్చినట్టు తెలుస్తోంది. ఆ ఒప్పందం బహిర్గతం అయిన తర్వాత మనకి అందులో అమెరికా అనుసరిస్తున్న రెండు రకాల నిర్బంధ పద్ధతులనూ చూడవచ్చు.

పెద్ద నోట్ల రద్దుకు పదేళ్లు

పదేళ్ల క్రితం, 2016 నవంబర్ 8వ తేదీ రాత్రి 8.15 గంటలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ పెద్ద నోట్ల రద్దును ప్రకటించారు. అప్పటివరకు చలామణిలో ఉన్న రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. వాటి స్థానంలో కొత్త రూ.500, రూ.2,000 నోట్లను ప్రవేశపెడతామని చెప్పారు. నల్లధనాన్ని వెలికితీయడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన లక్ష్యమని మోడీ ప్రకటించారు. నకిలీ నోట్ల చలామణిని అరికట్టడం, ఉగ్రవాదులకు అందుతున్న ఆర్థిక వనరులను దెబ్బతీయడం, అవినీతిని నిర్మూలించడం కూడా ఈ నిర్ణయం ఉద్దేశాలుగా చెప్పారు. సంఘ్ పరివార్ శ్రేణులు ఈ నిర్ణయాన్ని ఆకాశానికెత్తాయి. మోడీ అనుకూల మీడియా కూడా పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. కొత్తగా విడుదల చేసే నోట్లలో ప్రత్యేక చిప్ ఉంటుందని, అందువల్ల వాటిని నల్లధనంగా దాచడం సాధ్యం కాదని కూడా ప్రచారం చేశారు. కొత్త నోట్లకు నకిలీ తయారు చేయడం అసాధ్యమని సంఘ్ పరివార్ నేతలు గొప్పలు చెప్పారు. కానీ ఈ నిర్ణయంతో తీవ్రంగా నష్టపోయింది మాత్రం సామాన్య ప్రజలే. నోట్ల రద్దు ప్రకటనతో దేశమంతటా గందరగోళం నెలకొంది. పాత నోట్లను మార్చుకోవడానికి, బ్యాంకుల్లో జమ చేయడానికి ప్రజలు గంటల తరబడి క్యూలలో నిలబడాల్సి వచ్చింది. ఉత్తర భారతదేశంలో తీవ్రమైన చలిలో కూడా రోజుల తరబడి బ్యాంకుల ముందు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఈ క్రమంలో వంద మందికి పైగా ప్రజలు క్యూలలో నిలబడుతూనే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయారు. రద్దు చేసిన నోట్లకు సరిపడా కొత్త నోట్లను ముద్రించడంలో జరిగిన జాప్యం తీవ్ర నగదు కొరతకు దారితీసింది. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక, సేవా రంగాలన్నీ దెబ్బతిన్నాయి. చిన్నచిన్న వ్యాపారాలు పెద్ద సంఖ్యలో మూతపడ్డాయి. లక్షలాది మంది ఉపాధి కోల్పోయారు. ఆర్థిక కార్యకలాపాలు మందగించడంతో జిడిపి వృద్ధి రేటు కూడా పడిపోయింది. ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని గుర్తించిన మోడీ మరోసారి నాటకీయ ప్రకటన చేశారు. నోట్ల రద్దు వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించడానికి 50 రోజుల గడువు ఇవ్వాలని కోరారు. ఆ గడువు లోపల సమస్యలు పరిష్కారం కాకపోతే తాను ఏ శిక్షకైనా సిద్ధమని కూడా అన్నారు. అయితే నెలలు గడిచినా ప్రజల కష్టాలపై ప్రధాని మళ్లీ నోరు విప్పలేదు. నోట్ల రద్దు మొదటి వార్షికోత్సవం సందర్భంగా కూడా మోడీ మౌనంగానే ఉండిపోయారు. అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మాత్రమే మీడియా ప్రశ్నలను ఎదుర్కోవడానికి ముందుకొచ్చారు. నోట్ల రద్దు వ్యవసాయ రంగాన్నీ తీవ్రంగా దెబ్బతీసింది. రబీ వంటల సాగు ప్రారంభమయ్యే సమయంలో ఈ నిర్ణయం తీసుకోవడంతో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడానికి కూడా ఇబ్బందులు పడ్డారు. ఆ సీజన్‌లో ప్రభుత్వం దగ్గర ఉన్న విత్తనాలేవీ అమ్ముడుపోలేదని వ్యవసాయ మంత్రిత్వ శాఖ పార్లమెంటు ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘానికి సమర్పించిన నివేదిక లో



అంగీకరించింది. ఈ అంశంపై వివాదం తలెత్తడంతో తర్వాత మంత్రిత్వ శాఖ ఆ నివేదికను సవరించింది. నెరవేరని లక్ష్యాలుమోడీ ప్రకటించిన లక్ష్యాల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో నెరవేరలేదు.

పుట్టిన ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

(మొదటిపేజీ తరువాయి)

రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 27 లక్షల మంది విద్యార్థులకు ఏకకాలంలో బ్రేక్‌ఫాస్ట్ అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి అన్నారు. ఇది దేశంలోనే కాదు, ప్రపంచంలోనే ప్రత్యేకమని చెప్పుకొచ్చారు. తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

రైతులకు చౌకగా ఎరువులు

(మొదటిపేజీ తరువాయి)

రైతులకు చౌకగా ఎరువులు

యూరియా, డీఏపీ, ఎంఓపీ, సల్ఫర్ తదితర ఎరువులు మరియు ముడి పదార్థాల అంతర్జాతీయ ధరల హెచ్చుతగ్గులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ రాయితీ రేట్లను హేతుబద్ధీకరించింది. 2010 ఏప్రిల్ 1 నుండి అమల్లో ఉన్న ఎన్‌బీఎస్ పథకం కింద, ఎరువుల తయారీదారులు మరియు దిగుమతిదారుల ద్వారా డీఏపీ, ఎన్‌పీకేఎస్ గ్రేడ్‌లతో సహా 28 రకాల పీడకే ఎరువులను రైతులకు అత్యంత చౌకగా, సరసమైన ధరలకు అందించడమే లక్ష్యంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఆమోదించిన రేట్ల ప్రకారం ఎరువుల కంపెనీలకు ప్రభుత్వం నేరుగా రాయితీని చెల్లించనుంది.

స్టాండప్ ఇండియా, చిన్న సంస్థలకు భారీగా నిధులు

వ్యవసాయ రంగంతో పాటు దేశంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కేబినెట్ మరో రెండు ముఖ్య నిర్ణయాలు తీసుకుంది. ఎస్సీ, ఎస్టీ మరియు మహిళా పారిశ్రామికవేత్తలకు అండగా నిలిచే 'స్టాండప్ ఇండియా' పథకం కింద రుణాల మంజూరు కోసం రూ. 4,111 కోట్లను కేబినెట్ ఆమోదించింది. అదేవిధంగా సూక్ష్మ, చిన్న తరహా సంస్థల బలోపేతం కోసం, వాటికి సులభతరంగా రుణాలు అందించేందుకు రూ. 5,000 కోట్ల నిధులను మంజూరు చేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.

'బోగస్ మాటలతో ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్'..

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర సమస్యలు పట్టడంలేదని, కానీ తన గడ్డం మీద ఫికర్ ఉందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఉంటే నీళ్ల జాతర ఉండేదని అన్నారు. కాంగ్రెస్ వచ్చిన తరవాత సంక్షేమ పథకాలు అన్ని బంద్ చేశారని వ్యాఖ్యానించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ అన్ని పథకాలు బంద్ అయ్యాయని చెప్పారు. త్వరలోనే కేసీఆర్ వస్తారని అన్ని ప్రశ్నలకు సమాధానం ఇస్తారన్నారు. నిర్మల్‌లో నాయకులు పార్టీని వీడినా కార్యకర్తలు మాత్రం వీడలేదని చెప్పారు.

జూనియర్ కాలేజీ లెక్చరర్లకు సీఎం రేవంత్ రెడ్డి భరోసా..

(మొదటిపేజీ తరువాయి)

కొత్త విద్యా స్వరూపం.. 10+2 విధానం

రాష్ట్రంలో విద్యా సంస్కరణల్లో భాగంగా నూతన తరగతుల వర్గీకరణను సీఎం వివరించారు. నర్సరీ నుంచి 4వ తరగతి వరకు ప్రాథమిక విద్యగా, 5 నుంచి 8వ తరగతి వరకు సెకండరీ విద్యగా మరియు 9 నుంచి 12వ తరగతి వరకు సీనియర్ సెకండరీ విద్యగా వర్గీకరించనున్నారు. 12వ తరగతి పూర్తయ్యే నాటికి విద్యార్థులు భాషా పరిజ్ఞానంతో పాటు సమాచార, సాంకేతిక నైపుణ్యాలపై సంపూర్ణ పట్టు సాధించేలా బోధనా విధానాన్ని తీర్చిదిద్దాలని ఆదేశించారు.

ఉద్యోగులకు భరోసా - సొంత భవనాల నిర్మాణం

నూతన విధానం వల్ల జూనియర్ కాలేజ్ సిబ్బందికి ఎలాంటి నష్టం ఉండదని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. లెక్చరర్ల ఉద్యోగ భద్రతకు ఢోకా లేదని, వారి రిటైర్మెంట్ బెనిఫిట్లకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. అలాగే, రాష్ట్రంలో అద్దె భవనాల్లో సంక్షేమ హాస్టళ్లు నడవడానికి వీల్లేదని, హాస్టళ్లు మరియు రెసిడెన్షియల్ స్కూళ్లకు సొంత భవనాలను నిర్మించాలని అధికారులకు స్పష్టం చేశారు.

మౌలిక వసతులు - యంగ్ ఇండియా స్కూళ్లు

విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, 'యంగ్ ఇండియా' స్కూళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని తేల్చిచెప్పారు. అదేవిధంగా, సాంకేతిక విద్యను బలోపేతం చేసేందుకు పాలిటెక్నిక్ కళాశాలల ఆధునీకరణకు కావలసిన నిధుల విడుదలను వేగవంతం చేయాలని సీఎం అధికారులను పురమాయించారు.

'మోడీని గద్దె దించడమే కాంగ్రెస్ లక్ష్యం'..

(మొదటిపేజీ తరువాయి)



గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు.

నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం..

ప్రస్తుత కంపెనీల అవసరాలకు తగ్గట్టుగా యువతలో నైపుణ్యాలు పెరగాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యువతలో స్కిల్స్ పెంపొందించేందుకే ఐటీఐలను ఐటీసీలుగా మారుస్తున్నామని తెలిపారు. మరిన్ని ఆధునిక వసతులతో రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీని కూడా నిర్మిస్తున్నట్లుగా వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెరగడం వల్ల వైట్ కాలర్ ఉద్యోగాలకు ముప్పు ఏర్పడుతోందని, అయితే ఏఐ సాంకేతికత ఎంత విస్తరించినా బ్లూ కాలర్ ఉద్యోగాలకు ఎలాంటి ప్రమాదం ఉండదని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సచార్ కమిటీ సిఫార్సుల మేరకు మైనార్టీలకు విద్య, ఉద్యోగాల్లో 4 శాతం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించిందని సీఎం గుర్తుచేశారు. బీజేపీ పాలిత గుజరాత్‌లో కూడా మైనార్టీ రిజర్వేషన్లు అమలువుతున్నాయని, కానీ తెలంగాణలో మాత్రం వాటిని తొలగిస్తామని బీజేపీ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

మోడీని గద్దె దించడమే కాంగ్రెస్ లక్ష్యం

రాష్ట్రంలో మైనార్టీల ఓటు హక్కును దూరం చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. సర్ పేరిట భారీగా మైనార్టీలు, ఎస్టీలు, ఆదివాసీలు, నిరుపేదల ఓట్లను జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. మైనార్టీ విద్యార్థులకు అందే స్కాలర్‌షిప్‌లపై కూడా కాషాయ పార్టీ రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీ ఒకటేనంటూ బీఆర్ఎస్ చేస్తోన్న ఆరోపణలను సీఎం తిరస్కరించారు. రాబోయే ఎన్నికల్లో నరేంద్ర మోడీని ఓడించి కేంద్రంలో గద్దె దించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఢిల్లీకి వెళ్లి మోడీ ముందు మోకరిల్లి సాగిలపడింది ఎవరో ప్రజలందరికీ బాగా తెలుసంటూ బీఆర్ఎస్ నేతలపై పరోక్షంగా సెటైర్లు వేశారు.

నిధులున్నా పనులు చేయరా?

ప్రజల ఇబ్బందులపై సమరశంఖం పూరించిన కళ్లెం నవజీవన్ రెడ్డి..

రోడ్డుపై బైఠాయించి అధికారులను నిలదీసిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



నిర్భయవార్త ప్రతినిధి :
హయత్ నగర్:

ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, నిధులు మంజూరైనా అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో విఫలమైన అధికారుల తీరుపై హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా స్థానిక కాలనీవాసులతో కలిసి ఆయన రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. హయత్ నగర్ డివిజన్ పరిధిలోని ముదిరాజ్ కాలనీ నుండి మునుగనూర్ కల్వర్ట్ వరకు నిర్మించాల్సిన డ్రైనేజీ ట్రంక్ లైన్ పనులకు నిధులు మంజూరై దాదాపు మూడేళ్లు గడుస్తున్నా పనులు నేటికీ పూర్తికాలేదు. మూడు విడతలుగా చేపట్టాల్సిన పనులను అధికారులు మధ్యలోనే నిలిపివేయడంతో ముదిరాజ్ కాలనీ, లక్ష్మీప్రియ కాలనీ, దుర్గా నగర్, శివాజీ నగర్ తదితర పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యపై స్పందించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి స్థానికులతో కలిసి క్షేత్రస్థాయిలో అసంపూర్తి పనులను పరిశీలించారు. అనంతరం జైస్వాల్ ఫర్నిచర్ వద్ద రోడ్డుపై బైఠాయించి అధికారుల అలసత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల అవసరాల కోసం ప్రజాధనంతో చేపట్టే పనుల పట్ల ఇంత నిర్లక్ష్యం ఎందుకని అధికారులను నిలదీశారు. నిధులున్నా మూడేళ్లుగా పనులు పూర్తి చేయక పోవడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. కాగితాలపై అభివృద్ధి చూపించడం కాదని, క్షేత్రస్థాయిలో ప్రజలకు ఫలితం కనిపించాలని స్పష్టం చేశారు. తక్షణమే నిలిచిపోయిన డ్రైనేజీ ట్రంక్ లైన్ పనులను పునఃప్రారంభించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు కాలయాపన చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, ప్రజలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజాపక్షాన నిలబడి పోరాడటమే తన కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇట్టబోయిన నర్సింహా, నాయకులు జనార్దన్, జంగా రెడ్డిలతో పాటు వివిధ కాలనీల అధ్యక్షులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో ఘనంగా 'అన్వి బాక్స్ క్రికెట్ అకాడమీ' ప్రారంభోత్సవం



నిర్భయవార్త ప్రతినిధి
:హయత్‌నగర్:

హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కుంట్లూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'అన్వి బాక్స్ క్రికెట్ అకాడమీ' బుధవారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక క్రీడాకారులు, యువత ఉత్సాహాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వాహకుడు బెజ్జెంకి రాజశేఖర్ రెడ్డి ఈ బాక్స్ క్రికెట్ ప్రాంగణాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి అకాడమీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత యాంత్రిక జీవన విధానంలో మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. యువత సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లకే పరిమితం కాకుండా మైదానాల్లోకి వచ్చి క్రీడల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కుంట్లూరు పరిసర ప్రాంతాల యువతకు, క్రీడాభిమానులకు అందుబాటులోకి అత్యాధునిక వసతులతో కూడిన బాక్స్ క్రికెట్ అకాడమీని తీసుకురావడం అభినందనీయమని, స్థానిక క్రీడాకారులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, ఉద్యోగులు వీకెండ్స్‌తో పాటు తీరిక వేళల్లో ఇలాంటి బాక్స్ క్రికెట్ టర్ఫ్‌లను ఉపయోగించుకుని ఒత్తిడిని అధిగమించవచ్చని నాచించారు. అకాడమీ వ్యవస్థాపకుడు, నిర్వాహకుడు బెజ్జెంకి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక ప్రాంత యువత, అన్ని వయసుల క్రీడాకారుల సౌకర్యార్థం అంతర్జాతీయ ప్రమాణాల తరహాలో టర్ఫ్, హై-మాస్ట్ ఫ్లడ్ లైట్లు, అత్యుత్తమ నెట్టింగ్ మరియు ఆధునిక సదుపాయాలతో 'అన్వి బాక్స్ క్రికెట్ అకాడమీ'ని తీర్చిదిద్దామని తెలిపారు. ఈ అకాడమీ ప్రతిరోజూ ఉదయం 8:00 గంటల నుండి రాత్రి 11:00 గంటల వరకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. ప్రారంభ ఆఫర్ కింద గంటకు కేవలం రూ. 500 నామమాత్రపు రుసుముతోనే ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు వెల్లడించారు. రాత్రి వేళల్లో కూడా డే నైట్ మ్యాచ్‌లు ఆడుకునేందుకు ప్రత్యేక లైటింగ్ సౌకర్యం ఉందని, స్లాట్స్ బుకింగ్స్ మరియు ఇతర వివరాల కోసం 9666971206 నంబర్‌ను సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలన్ శివారెడ్డి నగర్ అధ్యక్షులు కాలన్ నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు కాలన్ దేవేందర్ రెడ్డి, బెజ్జెంకి జోగి రెడ్డి, సరెడ్డి సుమన్ రెడ్డి, వెలిమినేటి ప్రకాష్ రెడ్డి, సామ మహేందర్ రెడ్డి, సురేష్ నాయుడు, వలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పెద్ద సంఖ్యలో కాలనీవాసులు, యువత, క్రీడాకారులు పాల్గొన్నారు

తిమ్మాయిగూడలో అంబరాన్నంటిన సదర్ సంబరాలు

హోరెత్తిన తీన్‌మార్ డప్పులు, ఆకట్టుకున్న దున్నపోతుల విన్యాసాలు





నిర్భయవార్త ప్రతినిధి : అబ్దుల్లాపూర్‌మెట్:

తిమ్మాయిగూడ గ్రామంలో శ్రీ గోపికృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సదర్ ఉత్సవాలు అత్యంత వైభవంగా, సంప్రదాయబద్ధంగా జరిగాయి. యాదవ సోదరులు, గ్రామస్థులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి వేడుకలను ఉత్సాహంగా ప్రారంభించారు. రంగురంగుల పూలమాలలు, నెమలి పింఛాలు, గజ్జెల పట్టీలతో రాజసంగా అలంకరించిన భారీ దున్నపోతులు చేసిన విన్యాసాలు చూపరులను ఎంతగానో కట్టిపడేశాయి. హోరెత్తిన తీన్‌మార్ డప్పు చప్పుళ్లు, పాటల మధ్య యువకులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేయడంతో గ్రామంలో పండుగ శోభ వెల్లివిరిసింది. ఈ కన్నులపండువ వేడుకలను తిలకించేందుకు గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు, యువకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సంబరాలకు రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మల్‌రెడ్డి అభిషేక్ రెడ్డి, నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా, బాటసింగారం సహకార బ్యాంక్ చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి, జీఎస్ సేవా సమితి చైర్మన్ గ్యారాల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు మాజీ సర్పంచులు మూల మహేష్, ముద్దం వీరస్వామి యాదవ్, మాజీ ఎంపీటీసీ చేగూరి వెంకటేష్, నాయకులు బీమగౌని భాస్కర్ గౌడ్, జుజ్జిమెట్ల బాలరాజ్, మాజీ ఉపసర్పంచులు దేవుని పర్వతాలు, దేవుని ఆంజనేయులు హాజరయ్యారు. ఉత్సవాల విజయవంతానికి శ్రీ గోపికృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడు దేవుని వెంకటేష్, ఉపాధ్యక్షుడు దేవరగారి రాజు, ప్రధాన కార్యదర్శి కొవ్వా మహేష్, కోశాధికారి వల్లపు బాలకృష్ణ, కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు విశేష కృషి చేసి కార్యక్రమాన్ని ఘనంగా ముగించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అక్రమ వసూళ్లు అరికట్టాలి

నిరుపేద ఆదివాసులకు న్యాయం చేయాలి
ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్షిక సతీష్



ములుగు నవంబర్ 11 (నీర్భయ వార్త జిల్లా ప్రతినిధి) ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ వెంకటాపురం మండల అధ్యక్షుడు తుర్స కృష్ణబాబు అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా కన్వీనర్ పర్షిక సతీష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద ఆదివాసుల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకుల అండదండలతో అర్హులైన నిరుపేదలకు దక్కాల్సిన ఇళ్లు ధనికులకు మంజూరవుతున్నాయని ఆరోపించారు. దీంతో నిజమైన పేద ఆదివాసుల సొంతింటి కల కలగానే మిగిలిపోతోందని అన్నారు. అంతేకాకుండా, ఇళ్ల నిర్మాణం పేరుతో కొంతమంది కాంట్రాక్టర్లు అమాయక ఆదివాసీ లబ్ధిదారుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్న ఆదివాసీ కుటుంబాల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అదనపు భారం మోపడం అన్యాయమని అన్నారు.ప్రభుత్వం నిరుపేద ఆదివాసులకు ఇళ్లను మంజూరు చేస్తుంటే, కొంతమంది కాంట్రాక్టర్లు అక్రమ వసూళ్లకు పాల్పడటం పథకం లక్ష్యానికే విరుద్ధమని పేర్కొన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జరుగుతున్న అక్రమ వసూళ్లపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అర్హులైన నిరుపేద ఆదివాసులకు న్యాయం చేయడంతో పాటు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ వెంకటాపురం మండల అధ్యక్షుడు తుర్స కృష్ణబాబు, మండల ఉపాధ్యక్షుడు తాటి రాంబాబు, సోడి గోపి, సంద సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి రీ-సర్వేతో భూ వివాదాలకు చెక్

నెల రోజుల్లో గ్రామ సర్వే పూర్తి చేసేలా ప్రణాళిక: కలెక్టర్ మను చౌదరి



కీసర, నవంబర్ 11 నిర్భయవార్త జిల్లా జిల్లా ప్రతినిధి: భూ రికార్డుల ఆధునీకరణ, భూ సరిహద్దు వివాదాల శాశ్వత పరిష్కారం, రైతులకు భూములపై స్పష్టమైన హక్కులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి రీ-సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. బుధవారం కీసర మండలం బోగారం గ్రామంలో నిర్వహించిన భూ భారతి రీ-సర్వే అవగాహన సదస్సులో ఆయన పాల్గొని రైతులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 1954 నాటి పాత సర్వే రికార్డులను ప్రస్తుత వివరాలతో సరిపోల్చి ఆధునీకరిస్తామని, శాటిలైట్ సాంకేతికత ద్వారా ప్రతి భూభాగాన్ని ఖచ్చితమైన కో-ఆర్డినేట్లతో గుర్తించి డిజిటల్ రికార్డుల్లో నమోదు చేస్తామని తెలిపారు. గ్రామ సరిహద్దులు, చెరువులు, ప్రభుత్వ, పట్టా భూములను స్పష్టంగా గుర్తించి సరిహద్దులు ఖరారు చేస్తామన్నారు. ముందస్తు నోటీసుల ద్వారా సర్వే తేదీలను రైతులకు తెలియజేస్తామని, రోజుకు 30 నుంచి 40 ఎకరాల చొప్పున సర్వే నిర్వహించి నెల రోజుల్లో గ్రామంలో ప్రక్రియను పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. సర్వే సమయంలో రైతుల సమక్షంలోనే భూములకు నాలుగు వైపులా మార్కింగ్ చేసి సరిహద్దు సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన రైతులు తప్పనిసరిగా హాజరుకావాలని, పట్టాదారులు రాలేని పక్షంలో వారి కుటుంబ సభ్యులు హాజరై భూములను చూపించవచ్చని సూచించారు. రీ-సర్వే సమయంలో లేదా అనంతరం ఏవైనా సమస్యలు తలెత్తితే అధికారులకు అర్జీ సమర్పించి పరిష్కరించుకోవచ్చన్నారు. గ్రామస్తులు ఈ సమాచారాన్ని ఇతర రైతులకు తెలియజేసి సర్వే విజయవంతానికి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి, కీసర ఆర్డీఓ, అడిషనల్ డైరెక్టర్ సర్వే ఆఫ్ ల్యాండ్స్, కీసర తహసీల్దార్, సంబంధిత అధికారులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు.. సమన్వయంతో ముందుకు సాగాలి

సింగరేణి మండల స్థాయి సమీక్ష సమావేశంలో అధికారులకు సూచనలు



కారేపల్లి నవంబర్ 11 నిర్భయవార్త రిపోర్టర్. కారేపల్లి మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని అధికారులు సూచించారు. మంగళవారం ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.మండల ప్రత్యేక అధికారి ప్రమీల, ఎంపీడీవో బి. పద్మ, తహసీల్దార్ ఓ. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై శాఖల వారీగా చర్చించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులు సూచించారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.అలాగే గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, స్థానిక సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం స్ఫూర్తిదాయకం...

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. శ్రీజ

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు



ఖమ్మం, నవంబర్ 11 నిర్భయవార్త రిపోర్టర్. స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం స్ఫూర్తిదాయకమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మౌలానా అబుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడూతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవం గా జరుపుకుంటున్నామని తెలిపారు. ఆజాద్ విద్యా రంగానికి చేసిన సేవలు, ఆయన ఆలోచనలు, పోరాట పటిమ ప్రతీ ఒక్కరికీ ఆదర్శనీయమని కొనియాడారు.భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆజాద్, స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రిగా దేశ విద్యా వ్యవస్థకు బలమైన పునాదులు వేశారన్నారు. ఐఐటీ, ఐఐఎస్సీ, యూజీసీ, సాహిత్య అకాడమీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల ఏర్పాటులో అబుల్ కలాం ఆజాద్ పాత్ర మరవరానిదని తెలిపారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు, సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఆజాద్ అన్నారని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్. రామ్మూర్తి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహ్మద్ ముజాహిద్, జిల్లా పశు సంవర్ధక అధికారి డా. పురందర్, జిల్లా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని అబుల్ కలాం ఆజాద్‌కి నివాళులర్పించారు.

తెలంగాణ వంటిల్లు నూతన రెస్టారెంట్‌ను ప్రారంభించిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య





ములుగు నవంబర్ 11 (నీర్భయ వార్త జిల్లా ప్రతినిధి) ఏటూరునాగారం మండల కేంద్రంలోని వై జంక్షన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ వంటిల్లు రెస్టారెంట్‌ను యూత్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య బుధవారం ఘనంగా ప్రారంభించారు. రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, బుధవారం ఏటూరునాగారం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న ఝాన్సీరాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కుంజా సూర్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రిబ్బన్ కట్ చేసి రెస్టారెంట్‌ను ప్రారంభించి, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కుంజా సూర్య మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన తెలంగాణ వంటిల్లు రెస్టారెంట్‌లో నాణ్యత, రుచికి ప్రాధాన్యతనిస్తూ వినియోగదారుల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. వ్యాపార రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగి మంచి పేరు సంపాదించాలని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం టౌన్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్




ఖమ్మం నవంబర్ 11 నిర్భయవార్త రిపోర్టర్. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ పరిపాలనను మరింత పటిష్టం చేయడం, విధుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఖమ్మం టౌన్ ఏసీపీ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ రికార్డులు, కేసుల వివరాలు, నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, పోలీస్ స్టేషన్ల పనితీరుపై సమీక్షించారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు పలు సూచనలు చేస్తూ, కేవలం కార్యాలయ స్థాయిలోనే కాకుండా క్షేత్రస్థాయిలోనూ పోలీస్ స్టేషన్ వారీగా సమగ్ర సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితి, నేరాల తీరు, పెండింగ్ కేసులు, ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు.ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు నేర నియంత్రణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు.అనంతరం ఏసీపీ కార్యాలయ ఆవరణలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని చాటిచెప్పారు.కార్యక్రమంలో ఏసీపీ రమణమూర్తి, ఇన్స్పెక్టర్లు సాధిక్ పాషా, రామకృష్ణ, చిట్టిబాబు, కరుణాకర్ పాల్గొన్నారు.

గుడుంబా తయారీ స్థావరాలపై పోలీసుల మెరుపు దాడి

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ముత్యం రమేష్
ఒక్కరోజే 21,800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
102 లీటర్ల గుడుంబా స్వాధీనం
వారం రోజుల్లో 35,900 లీటర్ల జాగరీ వాష్ ధ్వంసం
182 లీటర్ల గుడుంబా పట్టివేత -- 22 మందిపై కేసులు





వెంకటాపురం, నవంబర్ 11 (నీర్భయ వార్త జిల్లా ప్రతినిధి) ములుగు జిల్లా వెంకటాపురం మండల అటవీ ప్రాంతాలను అక్రమ గుడుంబా తయారీ కేంద్రాలుగా మార్చుకొని సాగిస్తున్న నాటు మద్యం తయారీదారులపై వెంకటాపురం పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. అడవుల్లో రహస్యంగా ఏర్పాటు చేసుకున్న తయారీ స్థావరాలపై ప్రత్యేక నిఘా పెట్టి వరుస దాడులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో భారీగా అక్రమ గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం పానకాన్ని ధ్వంసం చేయడంతో పాటు, తయారుచేసిన గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కరోజులోనే మూడు ప్రాంతాల్లో 105 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన సుమారు 21,800 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 102 లీటర్ల గుడుంబాను పోలీసులు స్వాధీనం చేసుకోవడం ఈ దాడుల తీవ్రతకు అద్దం పడుతోంది. ములుగు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఏటూరునాగారం ఏఎస్పీ పర్యవేక్షణలో వెంకటాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ అటవీ ప్రాంతాల్లో ఈ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. గ్రామాలకు దూరంగా అడవుల్లో గుట్టుచప్పుడు కాకుండా గుడుంబా తయారీకి పాల్పడుతున్న స్థావరాలను గుర్తించి పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు.

మూడు ప్రాంతాల్లో భారీగా బెల్లం పానకం ధ్వంసం

ఆలుబాక గ్రామపంచాయతీ పరిధిలోని ముత్తారం గ్రామ శివారులో అటవీ ప్రాంతంలో నిర్వహించిన దాడుల్లో 25 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన సుమారు 5,000 లీటర్ల బెల్లం పానకాన్ని పోలీసులు ధ్వంసం చేశారు. అక్కడే నిల్వ ఉంచిన 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా బోదాపురం గ్రామపంచాయతీ పరిధిలోని సీతారాంపురం గ్రామ శివారులో నిర్వహించిన తనిఖీల్లో 52 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన సుమారు 10,800 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 40 లీటర్ల గుడుంబాను పట్టుకున్నారు. బోదాపురం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో చేపట్టిన మరో దాడిలో 28 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన సుమారు 6,000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 32 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మూడు ప్రాంతాల్లో కలిపి మొత్తం 105 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 21,800 లీటర్ల బెల్లం పానకాన్ని పోలీసులు ధ్వంసం చేయగా, 102 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీలో పాల్గొన్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేశారు. వారం రోజులుగా నిరంతర **ఆపరేషన్ భారీగా అక్రమ మద్యం తయారీ సామగ్రి ధ్వంసం**

వెంకటాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గుడుంబా తయారీ, నిల్వ, విక్రయాలపై పోలీసులు గత వారం రోజులుగా ప్రత్యేక దృష్టి సారించారు. అటవీ ప్రాంతాల్లో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న తయారీ కేంద్రాలను గుర్తిస్తూ దశలవారీగా దాడులు నిర్వహిస్తున్నారు. ఈ వరుస దాడుల్లో ఈరోజు జరిగిన ఆపరేషన్‌తో కలిపి ఇప్పటివరకు మొత్తం 35,900 లీటర్ల బెల్లం పానకం (జాగరీ వాష్) ధ్వంసం చేశారు. అలాగే 182 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ కార్యకలాపాలకు పాల్పడిన మొత్తం 22 మందిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. భారీ పరిమాణంలో బెల్లం పానకం నిల్వలు బయటపడటం, అడవుల్లో విస్తరించిన తయారీ స్థావరాలపై పోలీసులు వరుసగా దాడులు చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అక్రమ గుడుంబా తయారీని అరికట్టడంతో పాటు, దాని సరఫరా వ్యవస్థను కూడా కట్టడి చేయాలనే లక్ష్యంతో పోలీసులు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది.

అక్రమ గుడుంబాపై నిఘా కొనసాగుతుంది

ఈ దాడుల్లో వెంకటాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ముత్యం రమేష్, ఎస్సైలు కె. తిరుపతిరావు, తిరుపతిరెడ్డి, పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు ఆలుబాక సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. అక్రమ మద్యం తయారీ, నిల్వ, విక్రయాలు, రవాణాకు పాల్పడే వారిపై నిరంతర నిఘా కొనసాగిస్తామని వెంకటాపురం పోలీసులు స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యానికి, సమాజానికి హానికరమైన గుడుంబా తయారీని సహించేది లేదని, ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ గుడుంబా తయారీ లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

గ్రామీణ కళాకారులకు సినిమా రంగంలో అవకాశాలు కల్పించడమే లక్ష్యం

సిద్దిపేటలో 'టీమ్ ఆఫ్ శివరై' సినిమా ఆడిషన్స్



నిర్భయవార్త ప్రతినిధి :సిద్దిపేట:

సిద్దిపేట జిల్లా ఫిలిం టీవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'టీమ్ ఆఫ్ శివరై' సినిమా ఆడిషన్స్ బుధవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాకారుల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 80 మంది కళాకారులు ఆడిషన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సినిమా నిర్మాత తేజస్విని మాట్లాడుతూ.. సిద్దిపేటతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన కళాకారులకు సినిమా రంగంలో అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా ఓటీటీ వేదికల కోసం సినిమాను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ ఉన్నప్పటికీ సరైన వేదిక, అవకాశాలు లేక అనేకమంది కళాకారులు మరుగున పడుతున్నారని, అలాంటి వారిలోని ప్రతిభను వెలికితీసి వారి కలలను సాకారం చేసుకునేందుకు ఈ సినిమా మంచి అవకాశంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాణఖీూూా అధ్యక్షులు బండి సుగుణ, సీనియర్ నటుడు గౌటి రాజు, నిర్మాత ఎం.డి. రహీం, కరట బాలు, ప్రధాన కార్యదర్శి డాకూరి భాస్కర్ రెడ్డి, కోశాధికారి నెమలి సుభాష్, సంయుక్త కార్యదర్శి చింతల మోజీ, ఏలుపుల భరత్, రాకేష్ గౌడ్, మహేందర్, ఎం.డి. సలీం, ఆసంపల్లి మాలతి, శ్వేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్‌లో 'సూర్య ఆటో ఎల్పీజీ గ్యాస్' బంక్ ప్రారంభం



నిర్భయవార్త ప్రతినిధి : ఎల్బీనగర్:

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని సాగర్ రింగ్ రోడ్డు సమీపంలో గల సువర్ణ భారతి గోశాల పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన 'సూర్య ఆటో ఎల్పీజీ గ్యాస్' బంకును బుధవారం ఘనంగా ప్రారంభించారు. పూజా కార్యక్రమాల అనంతరం నిర్వాహకులు రిబ్బన్ కట్ చేసి ఈ కేంద్రాన్ని వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా బంక్ నిర్వాహకులు మాట్లాడుతూ... వాహనదారులకు నాణ్యమైన, కల్తీలేని ఆటో ఎల్పీజీని సరసమైన ధరల్లో అందించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజుకూ పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఆటో ఎల్పీజీ వినియోగం వాహనదారులకు ఆర్థికంగా ఎంతో ఆదా చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు, ప్రైవేట్ క్యాబ్ డ్రైవర్లు, గ్యాస్ కిట్ అమర్చిన కార్ల యజమానులకు తమ బంక్ ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. కాలుష్య రహిత ఇంధనంగా గుర్తింపు పొందిన ఎల్పీజీని వాడటం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడినట్లవుతుందని వారు పేర్కొన్నారు. వినియోగదారులకు వేగవంతమైన సేవలతో పాటు సరైన కొలతలు, అత్యుత్తమ భద్రతా ప్రమాణాలను పాటించనున్నట్లు హామీ ఇచ్చారు. సాగర్ రింగ్ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రముఖులు, వ్యాపార భాగస్వాములు, ఆటో యూనియన్ ప్రతినిధులు మరియు వాహనదారులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఏజెన్సీలో విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

ఉపాధ్యాయుల హాజరుపై పర్యవేక్షణ పెంచాలి.. ఏకోపాధ్యాయ పాఠశాలలను బలోపేతం చేయాలి
జీవీఎస్‌పీ విద్యార్థి నాయకుడు పూనెం నితిన్ దొర డిమాండ్



ములుగు నవంబర్ 11 (నీర్భయ వార్త జిల్లా ప్రతినిధి) వెంకటాపురం ఏజెన్సీ ప్రాంతాల్లో రోజురోజుకూ తగ్గుతున్న విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వాలు, విద్యాశాఖ అధికారులు, స్థానిక యంత్రాంగం సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాలని గొండ్వానా విద్యార్థి సంక్షేమ పరిషత్ జీవీఎస్‌పీ విద్యార్థి నాయకుడు పూనెం నితిన్ దొర డిమాండ్ చేశారు.వెంకటాపురం మండలం చొక్కాల గ్రామంలో ఆదివాసీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యావ్యవస్థ అనేక సమస్యలతో నతమతమవుతోందని, సరైన పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రంతో పాటు మారుమూల గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుల హాజరుపై నిరంతర పర్యవేక్షణ

పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరును అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతి ఉపాధ్యాయుడు విధులకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. బినామీ లేదా అనధికారిక వ్యక్తులతో పాఠశాలలు నిర్వహించే పరిస్థితులకు అడ్డుకట్ట వేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చదవడం, రాయడంపై ప్రత్యేక శ్రద్ధ

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను కేవలం పరీక్షల మార్కుల ఆధారంగా కాకుండా ప్రాథమికంగా చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం వంటి నైపుణ్యాల ఆధారంగా మెరుగుపరచాలని సూచించారు. ఇందుకోసం ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

ఏకోపాధ్యాయ పాఠశాలలను బలోపేతం చేయాలి

ఏజెన్సీ ప్రాంతాల్లో అధికంగా ఉన్న ఏకోపాధ్యాయ పాఠశాలల్లో అవసరమైన మేరకు అదనపు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగేలా గ్రామాల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి

మండల విద్యాశాఖ అధికారులు ఎంఈఓ విధిగా పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని, తనిఖీల్లో గుర్తించిన లోటుపాట్లను వెంటనే సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్య అందించడం ప్రభుత్వ లక్ష్యంగా ఉండాలని, అందుకు అవసరమైన వసతులు, ఉపాధ్యాయులు, పర్యవేక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సబక సత్యనారాయణ, సబక శేఖర్, అట్టం సాయిబాబు, కోడం కళ్యాణ్, పాయం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా నిలుస్తున్న 'కృష్ణగోపాల్ సేవా సమితి' సేవా తత్పరత

శ్రీపతి విక్రం రెడ్డి వర్ధంతి సందర్భంగా వృద్ధాశ్రమంలో ఘనంగా అన్నదానం



నిర్భయవార్త ప్రతినిధి : వనస్థలిపురం:

'హర్ ఘర్ మేన్ భక్తి హర్ మానవ్ మేన్ మాధవ్' అనే పవిత్ర ఆశయంతో సమాజ సేవలో ముందుంటున్న ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ 'కృష్ణగోపాల్ సేవా సమితి' ఆధ్వర్యంలో బుధవారం ఓ వృద్ధాశ్రమంలో విశేష సేవా కార్యక్రమం నిర్వహించారు. శ్రీపతి విక్రం రెడ్డి 12వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ అన్నదాన కార్యక్రమాన్ని దిగ్విజయంగా చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణగోపాల్ సేవా సమితి ప్రతినిధులు, సభ్యులు స్థానిక ఓల్డ్ ఏజ్ హోమ్‌ను సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న సుమారు 40 నుంచి 50 మంది వృద్ధులకు స్వయంగా ప్రేమతో, ఆప్యాయతతో రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. అనంతరం శ్రీపతి విక్రం రెడ్డి చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించి, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వృద్ధుల ముఖాల్లో కనిపించిన చిరునవ్వులు, ఆనందమే ఈ కార్యక్రమానికి నిజమైన సార్థకత అని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కృష్ణగోపాల్ సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ... సమాజంలో ఆపన్నులు, అభాగ్యులను ఆదుకోవడమే దైవ సేవ అని ఉద్ఘాటించారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలోని ప్రత్యేక దినాలైన పుట్టినరోజులు, పెళ్లి రోజులు, వర్ధంతి స్మరణోత్సవాలు లేదా మరే ఇతర శుభకార్యాల సందర్భాల్లో వృధా ఖర్చులకు స్వస్తి పలికి, ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా వాటిని మరింత అర్థవంతంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పేదలు, నిరాశ్రయులకు అన్నదానం లేదా ఇతర సహాయ సహకారాలు అందించాలనుకునే దాతలు కృష్ణగోపాల్ సేవా సమితిని సంప్రదించవచ్చని తెలిపారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 8106876999

గోదావరి పుష్కరాల ఏర్పాట్ల పనులను వేగవంతం చేయాలి -- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

వచ్చే ఏప్రిల్ నాటికి గోదావరి పుష్కరాల పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం
విఐపి లకు భక్తులకు ఇబ్బందులు కలగకుండా వేరువేరుగా సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం..
దక్షిణ అయోధ్యగా పెరుగాంచిన భద్రాచలం..









భద్రాచలం నవంబర్ 11 నిర్భయ వార్త ప్రతినిధి.రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భద్రాచలంలోని గోదావరి నదీ తీర ప్రాంతాల్లో చేపడుతున్న ఘాట్ల అభివృద్ధి పనులు, ఆలయ పరిసరాల అభివృద్ధి ఇతర మౌలిక సదుపాయాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. బుధవారం నాడు భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనులు మరియు నూతన గోదావరి పుష్కర ఘాట్ నిర్మాణం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట తో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయంలోని చాంబర్లో సంబంధిత జిల్లా అధికారులు, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, కన్సల్టెంట్లు, ఆర్కిటెక్టులు, కాంట్రాక్టర్లు మరియు కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.సమావేశంలో శాఖల వారీగా చేపట్టిన పనుల పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులు, ఎదురవుతున్న సమస్యలు మరియు పనుల పూర్తి చేయడానికి అవసరమైన చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ విదేశాల నుండి భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుటకు అవకాశం దొరుకుతుందని తప్పనిసరిగా గోదావరి పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, సురక్షితమైన స్నానాలు, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు, రహదారులు, తాగునీటి సరఫరా, విద్యుత్ సదుపాయాలు, పారిశుధ్యం, డ్రైనేజీ, వైద్య సదుపాయాలు, భద్రత, రవాణా మరియు అగ్నిమాపక ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా పుష్కర వనం కోసం అనువైన స్థలం సేకరించాలని, విఐపి లకు భక్తులకు వేరువేరుగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని అలాగే భక్తుల కోసం డార్మెటరీలు సిద్ధం చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేవస్థానం అభివృద్ధి పనులతో పాటు పుష్కర ఘాట్ పనులకు కలిపి 348 కోట్ల 59 లక్షలు నిధులు విడుదల చేసినందున అన్ని శాఖల అధికారులు తమకు కేటాయించిన పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని, పనుల అమలులో ఎలాంటి జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అవసరమైన చోట శాఖల మధ్య సమన్వయం పెంపొందించుకుని, ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవాలని తెలిపారు. గోదావరి పుష్కరాల నిర్వహణకు భద్రాచలాన్ని అన్ని విధాలుగా సిద్ధం చేసే లక్ష్యంతో అధికారులు సమష్టి బాధ్యతతో పనిచేసి, అభివృద్ధి పనులన్నింటినీ శ్రీరామనవమి నాటికి పూర్తి చేయాలని, శాఖల మధ్య ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే జిల్లా కలెక్టర్ మరియు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని, పనులు మాత్రం ఆపవద్దని ఆమె అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఆర్ అండ్ బి ఈ ఈ నాగేశ్వరరావు, డిపిఓ అనూష, ట్రాన్స్కో ఎస్ఈ మహేందర్, డీఎంహెచ్ఓ తుకారం రాథోడ్, డి ఎ వో భగవాన్ రెడ్డి, తాసిల్దార్ రవికుమార్, భద్రాచలం సర్పంచ్ పూణేం కృష్ణ మరియు వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములు విద్యుత్ లైన్ ఏర్పాటుకు సిజిఆర్ఎఫ్ చైర్మన్ కు వినతి

చీమలపాడులో సీజీఆర్ఎఫ్ సదస్సు



కారేపల్లి నవంబర్ 11 నిర్భయవార్త రిపోర్టర్. విద్యుత్ వినియోగదారులసమస్యలపై బుధవారం కారేపల్లి మండలం చీమలపాడు 33/11 కేవీ సబ్ లో సీజీఆర్ఎఫ్ (విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక) సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఏన్కూర్, తిమ్మారావుపేట, చీమలపాడు, కారేపల్లి సెక్షన్లకు సంబంధించి వినియోగదారులు తమ సమస్యలను సీజీఆర్ఎఫ్ చైర్మన్ కే.మాధవరావు, పైనాన్స్ మెంబర్ ఎస్.సత్యనారాయణ, ఇండిపెండెంట్ మెంబర్ ఎం.రామారావు లకు వివరించారు. కొత్త విద్యుత్ లైన్లు, వరిగిన, విరిగిన పోల్స్ మార్పు, పోడు భూములలో విద్యుత్ లైన్ ఏర్పాటు గురించి రైతులు సీజీఆర్ఎఫ్ చైర్మన్ కు వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారంలో జాప్యం చేయవద్దన్నారు. జఠిలమైన సమస్యలపై వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం ను చూపాలన్నారు. ఈకార్యక్రమంలో చీమలపాడు సర్పంచ్ మాలోత్ బావుసింగ్, అకౌంట్స్ ఆఫీసర్ శ్రీధర్, డీఈ వై.రమేష్, ఏడీఈ ఎండి యాసిన్ ఖాన్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ సాయన్న, ఏన్కూర్, తిమ్మారావుపేట, చీమలపాడు, కారేపల్లి అసిస్టెంట్ ఇంజనీర్లు ఉమాకాంత్, సీహెచ్.వెంకన్న, శ్రీశైలం, సబ్ ఇంజనీర్లు ప్రీతి, సాయి శ్రీ తదితరులు పాల్గొన్నారు.

కెపిహెచ్‌బి లో ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి మార్గం సుగమం

సీఎం, మంత్రి చొరవతో ముందడుగు.. శేరి సతీష్ రెడ్డి హర్షం, కృతజ్ఞతలు గత పాలకుల నిర్లక్ష్యంపై విమర్శలు





కూకట్‌పల్లి, నవంబర్ 11 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి ఉమ్మడి కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు లేఔట్‌లో ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని అధికారికంగా ప్రభుత్వ పాఠశాల స్థలంగా గుర్తించేలా చర్యలు చేపట్టిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు శేరి సతీష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ స్థలాన్ని ప్రభుత్వ పాఠశాల అవసరాలకు వినియోగించేలా అధికారిక చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి ముఖ్యమంత్రితో చర్చించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో గుర్తింపు ప్రక్రియలో ముందడుగు పడిందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ పేరుతో పాఠశాల నిర్మిస్తామని నిధులు సేకరించి, పిల్లర్లు వేసి పనులను అసంపూర్తిగా వదిలేశారని ఆరోపించారు. పదేళ్ల పాలనలో పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎందుకు చొరవ చూపలేదని ప్రశ్నించారు. అప్పటి నిర్మాణానికి తీసుకున్న అనుమతులు, సేకరించిన నిధులు, చేసిన ఖర్చుల వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలంలో అధికారిక అనుమతులు లేకుండా ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేవట్టడం ఎంతవరకు నమంజనమని నిలదీశారు.ప్రభుత్వ స్థలం ప్రజల ఆస్తి అని, దానిని ఎవరూ సొంత ఆస్తిగా భావించకూడదని స్పష్టం చేశారు. పాఠశాల నిర్మాణానికి వివరాలు అందించాలనుకునేవారు సంబంధిత ప్రభుత్వ శాఖను సంప్రదించి అధికారికంగా సహకరించాలని, నిర్మాణ పనులన్నీ ప్రభుత్వ పర్యవేక్షణలో పారదర్శకంగా జరగాలని సూచించారు. పాఠశాలకు పేరు పెట్టడం కంటే విద్యార్థులకు నాణ్యమైన విద్య, పూర్తిస్థాయి భవనం, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ముఖ్యమని పేర్కొంటూ, కేటాయించిన స్థలంలో ప్రభుత్వ పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రజా ఆస్తుల పరిరక్షణతో పాటు ప్రభుత్వ విద్య బలోపేతానికి స్పందించిన ముఖ్యమంత్రి, మంత్రికి మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, ఉమ్మడి కేపీహెచ్‌బీ డివిజన్ మాజీ అధ్యక్షుడు తమ్మినేని ప్రవీణ్ కుమార్, కూకట్‌పల్లి నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ సెల్ కన్వీనర్ మేకల మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి.. ఇద్దరు పట్టివేత.

నలుగురు పరారీ.. రూ.13,200 నగదు, ఆటో, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం



కారేపల్లి నవంబర్ 11 నిర్భయవార్త రిపోర్టర్. కారేపల్లి మండలంలోని ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ ఆలయ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకోగా, మరో నలుగురు పోలీసుల కళ్లుగప్పి పరారయ్యారు.ఆలయ సమీపంలోని జామ తోటలో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు కారేపల్లి ఎస్సై వి. రమేష్ ఆధ్వర్యంలో బ్లూకోల్ట్స్ సిబ్బంది, పోలీసు సిబ్బంది కలిసి పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా బోడ సంతోష్, లాకవత్ చింటు, మూడు వినోద్, భూక్యా రాజేష్, లాకవత్ రత్నం, మూడు రవి అనే ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు గుర్తించారు.పోలీసులు వారిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా నలుగురు అక్కడి నుంచి పరారయ్యారు. ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.13,200 నగదు, ఒక ఆటో, రెండు సెల్‌ఫోన్లు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వి. రమేష్ తెలిపారు.మండలంలో ఎవరైనా పేకాట, జూదం వంటి చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఇలాంటి కార్యకలాపాలు ఎక్కడైనా నిర్వహిస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

ములుగులో శ్రీ సీతారామ లక్ష్మణ, ధ్వజస్తంభం నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్



ములుగు నవంబర్ 11 (నీర్భయ వార్త జిల్లా ప్రతినిధి) ములుగు జిల్లా కేంద్రంలోని శ్రీ సీతారామ ఆలయంలో బుధవారం నిర్వహించిన శ్రీ సీతారామ లక్ష్మణ విగ్రహాలు, ధ్వజస్తంభం నూతన ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు.రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచన మేరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్న భానోత్ రవిచందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా భానోత్ రవిచందర్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి సీతక్క సహకారంతో రామాలయం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం పూర్తయిందని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా రామాలయ అభివృద్ధికి మంత్రి సీతక్క ఎల్లప్పుడూ సహకారం అందిస్తారని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చింతనిప్పుల బిక్షపతి, మాజీ జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు రియాజ్ మీర్జా, ఆత్మ కమిటీ జిల్లా డైరెక్టర్ జక్కుల రేవంత్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు పౌడాల ఓంప్రకాష్, గుంటోజు పావని నిరంజన్ చారి, జిల్లా నాయకులు లక్కీ, విజయ్ యాదవ్, గంద్రకోట సుధీర్, యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గూడెపు రాకేష్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి బొమ్మగాని ప్రభు, యూత్ నాయకులు చందు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

‘భూ రీసర్వేలో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు!’..

రైతులకు మేలు జరిగేలా.. ప్రతి ఎకరాకు పక్కా హద్దులు


నవంబర్ నెలాఖరులోగా తొలి విడత సర్వే లక్ష్యం పూర్తి చేయాలి

నాణ్యతే ప్రామాణికం.. తొందరపాటుతో తప్పులు చేస్తే సహించేది లేదు

మండలాల వారీగా ప్రత్యేక బృందాలు.. లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు వినియోగించుకోవాలి

అవకతవకలకు పాల్పడే అధికారులపై సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు

జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు



నిర్భయవార్త ప్రతినిధి :వరంగల్:

రాష్ట్రంలో తరతరాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రైతులు, భూ యజమానులకు తమ భూములపై స్పష్టమైన హక్కులు కల్పించే లక్ష్యంతో చేపట్టిన సమగ్ర భూముల రీసర్వే ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూముల సర్వే అనేది కేవలం ప్రభుత్వ రికార్డుల్లో వివరాలను నమోదు చేసే ప్రక్రియ మాత్రమే కాదని, లక్షలాది మంది రైతులు, భూ యజమానుల భవిష్యత్తు హక్కులతో ముడిపడి ఉన్న అత్యంత కీలకమైన కార్యక్రమమని స్పష్టం చేశారు. అందువల్ల సర్వే నిర్వహణలో ఎక్కడా నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని, ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ వివరాల ఆధారంగా రికార్డులు రూపొందించాలని సూచించారు. రీసర్వేలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలనే తొందరలో పొరపాట్లు జరిగితే భవిష్యత్తులో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజలకు మేలు జరిగేలా, సానుకూల వాతావరణంలో ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా భూముల రీసర్వే పురోగతిని, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను, సర్వే నిర్వహణలో ఉన్న లోపాలను, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఇప్పటికే పలుమార్లు ఈ అంశంపై సమావేశాలు నిర్వహించామని, ఉమ్మడి జిల్లాల పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు రెవెన్యూ అంశాలపై సమీక్షలు చేపట్టామని మంత్రి వివరించారు. కేవలం కార్యాలయాల్లో కూర్చొని అందిన నివేదికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోకుండా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రత్యేకంగా గ్రౌండ్ రిపోర్టులను సేకరిస్తున్నట్లు తెలిపారు. రీసర్వే సమయంలో అధికారులు, సర్వే సిబ్బందికి ఎదురవుతున్న సమస్యలు, రైతుల నుంచి వస్తున్న అభ్యంతరాలు, సాంకేతికపరమైన ఇబ్బందులు, రికార్డుల్లో కనిపిస్తున్న వ్యత్యాసాలను సమగ్రంగా పరిశీలించి పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నామని పేర్కొన్నారు. ఉన్నతాధికారులను సంతృప్తిపరిచేందుకు మాత్రమే నివేదికలు రూపొందించకుండా క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను యథాతథంగా తెలియజేయాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు.

ఎస్ఓపీ ప్రకారం పక్కాగా రీసర్వే

భూముల రీసర్వే కోసం రూపొందించిన ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ)ను ప్రతి అధికారి తప్పనిసరిగా అనుసరించాలని మంత్రి సూచించారు. సర్వే ప్రక్రియలో పాటించాల్సిన నిబంధనలు, విధివిధానాలను క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. సర్వే నిర్వహణలో ఎదురవుతున్న అనుభవాలు, సమస్యలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన మార్పులు, సవరణలు చేపట్టాలని తెలిపారు. ప్రతి గ్రామంలో భూముల వివరాలు, సరిహద్దులు, విస్తీర్ణాలు, పాత రికార్డులను సమన్వయం చేసుకుంటూ కచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా నివేదికల్లో వాస్తవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎక్కడైనా లోపాలు గుర్తిస్తే వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సరిదిద్దాలని తెలిపారు. రీసర్వేలో సేకరించే ప్రతి సమాచారం భవిష్యత్తులో భూ యజమానులకు ఆధారంగా నిలిచే అవకాశం ఉన్నందున అధికారులు పూర్తి బాధ్యతతో, చిత్తశుద్ధితో పనిచేయాలని స్పష్టం చేశారు.

నవంబర్ నెలాఖరులోగా తొలి విడత పూర్తి

రాష్ట్రవ్యాప్తంగా భూముల రీసర్వేను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ



రూపొందించిందని మంత్రి తెలిపారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాలతో పాటు నక్షా పటాలు అందుబాటులో లేని గ్రామాల్లోనూ నవంబర్ నెలాఖరులోగా రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు జిల్లాల కలెక్టర్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. సర్వే పనుల్లో జాప్యం జరగకుండా అవసరమైన సిబ్బంది, సాంకేతిక పరికరాలు, ఇతర వనరులను సమకూర్చుకోవాలని తెలిపారు. రాబోయే ఏడాదిన్నర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో భూముల సమగ్ర రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. ప్రతి జిల్లాలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు.

మండలాల వారీగా ప్రత్యేక సర్వే బృందాలు

రీసర్వే పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యతను కాపాడేందుకు ప్రతి మండలంలో ప్రత్యేక సర్వే బృందాలను ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అందుబాటులో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న సర్వే బృందాల సంఖ్య సరిపోని ప్రాంతాల్లో అదనపు బృందాలను ఏర్పాటు చేసి పనుల వేగం పెంచాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవడంతో పాటు సర్వే సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని పేర్కొన్నారు. ఏ గ్రామంలో ఎంత మేరకు సర్వే పూర్తయింది, ఇంకా ఎన్ని భూముల కొలతలు నిర్వహించాల్సి ఉంది, ఎక్కడైనా సాంకేతిక లేదా పరిపాలనాపరమైన సమస్యలు ఉన్నాయా అనే అంశాలను మండలాల వారీగా పర్యవేక్షించాలని సూచించారు. సర్వే బృందాల మధ్య సమన్వయం ఉండేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.

రైతుల సమక్షంలోనే భూముల కొలతలు

రీసర్వే ప్రక్రియలో రైతుల భాగస్వామ్యం అత్యంత కీలకమని మంత్రి స్పష్టం చేశారు. ఏ గ్రామంలో సర్వే నిర్వహించనున్నారో అక్కడి రైతులకు ముందుగానే సమాచారం అందించాలని, అవసరమైన నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. భూముల కొలతలు నిర్వహించే సమయంలో సంబంధిత రైతులు, భూ యజమానులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల సమక్షంలో సర్వే నిర్వహించడం ద్వారా భూముల హద్దులు, విస్తీర్ణాల విషయంలో భవిష్యత్తులో తలెత్తే అనుమానాలు, వివాదాలను తగ్గించే అవకాశం ఉంటుందని తెలిపారు. సర్వే ప్రారంభానికి ముందే రైతులకు ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అవసరమైన చోట కౌన్సెలింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. రైతులు తమ వద్ద ఉన్న పాత భూ పత్రాలు, పట్టాలు, ఇతర ఆధారాలను అధికారులకు అందించేలా ప్రోత్సహించాలని సూచించారు. సర్వే ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి అపోహలు ఉండకుండా అధికారులు గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

అభ్యంతరాల పరిష్కారానికి ప్రత్యేక అవకాశం

రీసర్వే అనంతరం భూ యజమానులకు తమ భూముల వివరాలపై అభ్యంతరాలు ఉంటే వాటిని ఎలా తెలియజేయాలి, ఎక్కడ సమర్పించాలి, సంబంధిత అధికారులు ఏ విధంగా పరిశీలించి పరిష్కరిస్తారనే విషయాలను ముందుగానే ప్రజలకు వివరించాలని మంత్రి సూచించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో భూముల వివరాలను ప్రజలకు తెలియజేస్తూ దండోరా వేయించాలని ఆదేశించారు. తద్వారా రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకునే అవకాశం కల్పించాలని తెలిపారు. సర్వే నివేదికల్లో ఏవైనా తప్పులు, విస్తీర్ణాల్లో వ్యత్యాసాలు, సరిహద్దుల విషయంలో అభ్యంతరాలు ఉంటే వాటిని సమర్పించేందుకు తగిన అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు. ప్రజల నుంచి అందిన అభ్యంతరాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి దరఖాస్తును పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఏ ఒక్క రైతు కూడా తన భూమికి సంబంధించిన సమస్యతో కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదని, ప్రజలకు పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

క్యూఆర్ కోడ్‌తో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు

రీసర్వే పూర్తయిన ప్రాంతాల్లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను క్యూఆర్ కోడ్‌తో అందించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ నేపథ్యంలో భూముల సర్వే వివరాలు, యాజమాన్య సమాచారం, విస్తీర్ణం, ఇతర రికార్డుల నమోదులో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. రికార్డుల్లో చిన్నపాటి పొరపాటు కూడా భవిష్యత్తులో భూ యజమానులకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉన్నందున ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. పాత రికార్డులు, ప్రస్తుత భూమి పరిస్థితులు, క్షేత్రస్థాయిలో నిర్వహించిన కొలతలను సరిపోల్చి సరైన వివరాలను నమోదు చేయాలని స్పష్టం చేశారు. రైతులకు అందించే కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు భవిష్యత్తులో వారి భూమి హక్కులకు సంబంధించిన కీలక ఆధారాలుగా ఉపయోగపడనున్న నేపథ్యంలో వాటి జారీలోనూ పూర్తి కచ్చితత్వం పాటించాలని ఆదేశించారు.

అసైన్డ్ భూముల పట్టాలపై ప్రత్యేక పరిశీలన

అసైన్డ్ భూములకు సంబంధించి అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. ఆయా భూములకు గతంలో జారీ చేసిన పట్టాలు అసలైనవా, నకిలీవా అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. పట్టా పొందిన వ్యక్తులే ప్రస్తుతం సంబంధిత భూములను అనుభవిస్తున్నారా లేదా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో నిర్ధారించాలని ఆదేశించారు. గతంలో ఒక వ్యక్తికి పట్టా జారీ చేసినప్పటికీ ప్రస్తుతం మరొకరు ఆ భూమిని సాగు చేస్తుంటే, ప్రస్తుత అనుభవదారుడు నిబంధనల ప్రకారం అర్హుడా కాదా అనే అంశాన్ని సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. పట్టాలో పేర్కొన్న భూమి విస్తీర్ణానికి, వాస్తవంగా క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణానికి మధ్య ఏమైనా తేడాలు ఉన్నాయా అనే విషయాన్ని కూడా సరిచూసుకోవాలని తెలిపారు. అసైన్డ్ భూములకు సంబంధించి ఎలాంటి అపోహలు, వివాదాలు తలెత్తకుండా పాత రికార్డులు, పట్టాల వివరాలు, ప్రస్తుత అనుభవ పరిస్థితులను నిబంధనల ప్రకారం పరిశీలించి నివేదికలు రూపొందించాలని ఆదేశించారు.

భూసేకరణ సర్వే నంబర్ల సమస్యలకూ పరిష్కారం

గతంలో వివిధ అభివృద్ధి పనుల కోసం భూసేకరణ చేసిన భూములకు సంబంధించిన సర్వే నంబర్లలో ఉన్న సమస్యలను కూడా రీసర్వే సమయంలో గుర్తించి పరిష్కరించాలని మంత్రి అధికారులకు సూచించారు. సాగునీటి చెరువులు, రహదారులు, కుంటలు, ఇతర ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసం సేకరించిన భూముల వివరాలను పరిశీలించాలని తెలిపారు. ఆయా భూములకు సంబంధించిన పాత రికార్డులు, సర్వే నంబర్లు, విస్తీర్ణాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను సరిపోల్చి సమస్యలు ఎక్కడున్నాయో గుర్తించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, ప్రజాప్రయోజనాల కోసం వినియోగిస్తున్న ఆస్తులు, రైతుల వ్యక్తిగత భూముల వివరాల నమోదులో స్పష్టత ఉండాలని సూచించారు. రీసర్వే ప్రక్రియ పూర్తయ్యే సమయానికి ఎలాంటి సమస్యలు పెండింగ్‌లో ఉండకుండా అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి తగిన పరిష్కారాలు చూపాలని స్పష్టం చేశారు.

అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు

భూముల రీసర్వే అనేది ప్రజల ఆస్తి హక్కులకు సంబంధించిన అత్యంత కీలకమైన ప్రక్రియ కావడంతో ఇందులో ఎలాంటి అక్రమాలు, అవకతవకలకు అవకాశం ఇవ్వకూడదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. ఏ అధికారి అయినా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అక్రమాలకు పాల్పడినా, రికార్డుల విషయంలో తప్పుడు వివరాలు నమోదు చేసినట్లు తేలినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాధ్యులైన అధికారులపై సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతుల భూముల విషయంలో ఎవరైనా అక్రమ ప్రయోజనాలు పొందేందుకు ప్రయత్నించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రీసర్వే ప్రక్రియలో పారదర్శకత, నాణ్యత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని, భవిష్యత్తులో రైతులు, భూ యజమానులకు ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు.

కాలపరిమితిలోగా రీసర్వే పూర్తి చేయాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి హాజరయ్యారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన ఆదేశాలు, సూచనలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో రీసర్వే ప్రక్రియను నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. మండలాల వారీగా సర్వే పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, నిర్దేశించిన కాలపట్టిక ప్రకారం పనులను వేగవంతం చేయాలని తెలిపారు. సర్వే నిర్వహణలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ రవి, ఆర్డీవోలు, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ, కలెక్టరేట్ ఏవో, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సినిమాసోర్ట్

రాజమౌళిని తిడతారా.వారణాసిని ఆపుతారా?

ప్రకాష్ రాజ్ కామెంట్స్ సినిమాలను బాయ్‌కాట్ చేయాలంటూ సోషల్ మీడియాలో చేసే ప్రచారంపై



నటుడు ప్రకాష్ రాజ్ స్పందించారు. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వారణాసి'లో తాను నటిస్తున్నానని, తనను చూసి సినిమాను బాయ్‌కాట్ చేయాలని కొందరు ప్రచారం చేస్తారేమోనని వ్యాఖ్యానించారు. ఒక నటుడి రాజకీయ అభిప్రాయాల కారణంగా వందల మంది శ్రమించిన సినిమాను టార్గెట్ చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియా వేదికగా సినిమాలపై బాయ్‌కాట్ పిలుపులు ఇవ్వడం, నటీనటుల వ్యక్తిగత అభిప్రాయాలను బట్టి ప్రాజెక్టులను టార్గెట్ చేయడం ఇటీవల కామన్ అయిపోయింది. తన రాజకీయ వ్యాఖ్యలతో తరచూ వార్తల్లో నిలిచే నటుడు ప్రకాష్ రాజ్, లేటెస్ట్ గా ఓ ఇంటర్వ్యూలో ఈ బాయ్‌కాట్ అంశంపై మాట్లాడారు. ముఖ్యంగా దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి ప్రాజెక్ట్ పేరును ప్రస్తావిస్తూ ఆయన చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్ గా మారాయి. గతంలోనూ తన పాత్రలు ఉన్న సినిమాలను అడ్డుకుంటామని కొందరు ప్రచారం చేశారని ప్రకాష్ రాజ్ పేర్కొన్నారు. కేజీఎఫ్ 2 విడుదల సమయంలోనూ ఇలాంటి ఆందోళనలు సోషల్ మీడియాలో కనిపించాయని, అయితే థియేటర్ల వద్ద ఆ చిత్రం సాధించిన వసూళ్లేమిటో అందరూ చూశారని గుర్తుచేశారు. ఇటీవల వచ్చిన ఇతర సినిమాల విషయంలోనూ విమర్శలు వచ్చినా, ప్రేక్షకులు సినిమా బాగుంటే థియేటర్లకు రావడం ఆగలేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే క్రమంలో రాజమౌళి రాబోయే ప్రాజెక్ట్ 'వారణాసి' అంశాన్ని ఆయన ప్రస్తావించారు. తాను ఆ చిత్రంలో నటిస్తున్న విషయాన్ని చెబుతూ, రేపు ట్విట్టర్‌లో తనను చూసి నెటిజన్లు రాజమౌళిపై పడతారేమోనని ఎద్దేవా చేశారు. ప్రకాష్ రాజ్‌ను ఎందుకు తీసుకున్నారంటూ డైరెక్టర్‌ను తిడతారని, ఆ తర్వాత బాయ్‌కాట్ వారణాసి అంటూ హ్యాష్ ట్యాగ్‌లు ట్రెండ్ చేస్తారా అని ప్రశ్నించారు. కేవలం ఆన్‌లైన్‌లో కూర్చుని ఇలాంటి ట్రెండ్లు నడపడం తప్పితే, నిజంగా అంత పెద్ద సినిమాను ఎవరైనా దేశంలో ఆపగలరా అని ఆయన నిలదీశారు.తాను కేవలం నటుడిని మాత్రమేనని, చిత్ర నిర్మాణ బాధ్యత తనది కాదని ప్రకాష్ రాజ్ గుర్తుచేశారు. ఒక భారీ సినిమా వెనుక వందలాది మంది సాంకేతిక నిపుణుల శ్రమ, నిర్మాతల భారీ పెట్టుబడులు ఉంటాయని చెప్పారు. కేవలం ఒక నటుడి రాజకీయ అభిప్రాయాలు నచ్చనంత మాత్రాన మొత్తం సినిమాను బహిష్కరించాలని చూడటం సరైన పద్ధతి కాదని ఆయన వాదించారు. ప్రేక్షకులు తెరపై కంటెంట్‌ను మాత్రమే చూస్తారని, వ్యక్తులపై ఉన్న అసంతృప్తితో వినోదాన్ని దూరం చేసుకోరని ఆయన చెప్పుకొచ్చారు.వాస్తవానికి సోషల్ మీడియాలో జరిగే నిరసనలకు, క్షేత్రస్థాయిలో బాక్సాఫీస్ ఫలితాలకు చాలా సందర్భాల్లో పొంతన ఉండటం లేదు. గతంలోనూ ఎన్నో భారీ చిత్రాలు ఇలాంటి బాయ్‌కాట్ సెగను ఎదుర్కొని కూడా ఘన విజయాలు సాధించిన దాఖలాలు ఉన్నాయి. అయితే ప్రకాష్ రాజ్ తరచూ వివాదాస్పద రాజకీయ అంశాల్లో జోక్యం చేసుకోవడం వల్లే ఆయన చిత్రాలపై వ్యతిరేకత వ్యక్తం అవుతోందనే వాదన కూడా మరోవైపు నుంచి బలంగా వినిపిస్తోంది.

మాయ లేడీ సెన్సార్.. క్రేజీ క్రేజీగా హీరో గారి వేషాలు

రాకేష్ వర్రే హీరోగా నటించిన 'మాయ లేడీ' సినిమాకు సెన్సార్ బోర్డు యు/ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. ఈ విషయాన్ని రజినీకాంత్ స్టైల్ ఎంట్రీ, 'శివాజీ' సినిమాలోని ఫేమస్ డైలాగ్‌తో ఫన్నీగా ప్రకటించారు. ఈ ప్రమో షనల్ వీడియో సోష ల్ మీడియాలో వైర ల్ అవుతోంది. నవంబర్ 13న సినిమా థి యేటర్లలో విడుదల కానుంది. సినిమా ప్రమోషన్స్ అంటే ఏదో రొటీన్ ప్రెస్ మీట్లు, క్యాజువల్ పోస్టర్లు వదిలే రోజులు ఎప్పుడో పోయాయి. ఆడియన్స్‌ను థియేటర్ వైవు తిప్పుకోవాలంటే కాస్త క్రేజీగా ఆలోచించాల్సిందే. సరిగ్గా ఇదే రూట్ ఎంచుకున్నాడు 'మాయ లేడీ' హీరో రాకేష్ వర్రే. తన



సినిమా సెన్సార్ పూర్తయిన విషయాన్ని ఎవరూ ఊహించని రీతిలో, క్రేజీ కామెడీ టచ్‌తో అనౌన్స్ చేసి సోషల్ మీడియాలో బజ్ క్రియేట్ చేసే ప్రయత్నం చేశాడు. ఆఫీస్‌లో టీమ్ మొత్తం కూర్చుని సెన్సార్ సర్టిఫికెట్ కోసం వెయిట్ చేస్తుంటే, మనోడు మాత్రం నెక్ట్స్ లెవెల్ ఎంట్రీ ప్లాన్ చేశాడు. బ్లాక్ గాగుల్స్, చేతిలో గొడుగు పట్టుకుని కూలీ సినిమాలో రజినీకాంత్ రేంజ్ స్వాగ్‌తో రూమ్‌లోకి నడుచుకుంటూ వచ్చాడు. ఇంతలో టీమ్ నుంచి ఫోన్ చేసి మీటింగ్ టైమ్‌కి రాకుండా ఏంటిరా ఈ ఓవరాక్షన్ అని అడిగితే, శివాజీ సినిమాలోని 'పందులే గుంపుగా వస్తాయి.. సింహం సింగిల్‌గా వస్తుంది' అంటూ ఆల్ టైమ్ ఫేమస్ డైలాగ్‌తో రిప్లై ఇవ్వడం హిలేరియస్‌గా సాగింది. తీరా అంత బిల్డప్ ఇచ్చి టేబుల్ మీద పెట్టింది చూస్తే సెన్సార్ పోస్టర్. 'మాయ లేడీ' చిత్రానికి సెన్సార్ బోర్డు క్లీన్ యు/ఎ సర్టిఫికెట్ ఇచ్చిందని ఇలా వెరైటీగా రివీల్ చేశారు. చిన్న వీడియోనే అయినా ఎంటర్‌టైనింగ్‌గా ఉండటంతో సోషల్ మీడియాలో ఈ క్లిప్ వైరల్ అవుతోంది. కంటెంట్‌తో పాటు ప్రమోషన్లలో కూడా కొత్తదనం చూపిస్తే యూత్ వెంటనే కనెక్ట్ అవుతారు. నిజానికి క్రేజీ యాంట్స్ బ్యానర్ నుంచి సినిమా వస్తోందంటే ఇలాంటి అవుట్ ఆఫ్ ది బాక్స్ ప్రమోషన్స్ కామన్. గతంలో 'ఎవరికీ చెప్పొద్దు' సినిమాకి కూడా రాకేష్ ఇలానే డిఫరెంట్ ఐడియాలతో ప్రమోట్ చేసి సినిమాను జనాల్లోకి తీసుకెళ్లారు. ఇప్పుడు 'మాయ లేడీ' విషయంలోనూ అదే స్ట్రాటజీ ఫాలో అవుతున్నారు. ట్రైలర్‌లో ట్విన్స్ కన్ఫ్యూజన్ లవ్ స్టోరీతో పాటు సత్య కామెడీ హైలైట్ కాగా, ఇప్పుడు ఈ సెన్సార్ వీడియో కూడా ప్రాజెక్ట్ మీద పాజిటివ్ వైబ్‌ను పెంచేసింది రొమాంటిక్ కామెడీ జానర్లకు ఆడియన్స్ ఎప్పుడూ రెడీగానే ఉంటారు. దానికి తోడు విశాల్ చంద్రశేఖర్ మ్యూజిక్, మధుమిత సర్కార్ డ్యుయల్ రోల్ వేరియేషన్స్ సినిమాకి మెయిన్ ఎట్రాక్షన్‌గా మారాయి. ఇప్పటికే యూత్ సర్కిల్స్‌లో మంచి క్రేజ్ తెచ్చుకున్న ఈ చిత్రం నవంబర్ 13న గ్రాండ్‌గా థియేటర్లలోకి వస్తోంది. ప్రమోషన్లలో చూపిస్తున్న ఈ ఫన్ థియేటర్లలో కూడా వర్కవుట్ అయితే బాక్సాఫీస్ దగ్గర 'మాయ లేడీ' గట్టిగానే సౌండ్ చేసే చాన్స్ ఉంటుంది.

వారణాసి.. దిల్ రాజుకు పోటీగా బిగ్ డీల్?

మహేష్ బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'వారణాసి' నైజాం హక్కుల కోసం దిల్ రాజుతో పాటు మైత్రీ మూవీ మేకర్స్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పోటీపడినట్లు తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కుల కోసం మైత్రీ సంస్థ రూ. 290-300 కోట్ల భారీ డీల్ కుదుర్చుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. '===' హక్కుల ధరను మించి ఈ డీల్ ఉండటం ట్రేడ్‌లో ఆసక్తికరంగా మారింది. రాజమౌళి సినిమా వస్తుందంటే నిర్మాతలతో పాటు డిస్ట్రిబ్యూటర్ల మధ్య కూడా పోటీ మామూలుగా ఉండదు. ముఖ్యంగా నైజాం ఏరియాలో ఆయన సినిమాలకు భారీ డిమాండ్ ఉంటుంది. గతంలో రాజమౌళి సినిమాల పంపిణీలో దిల్ రాజు కీలకంగా వ్యవహరించారు. భారీ ధర పెట్టి రైట్స్ కొనడంతో పాటు మంచి లాభాలు కూడా అందుకున్నారు. అయితే ఈసారి మహేష్ బాబుతో రాజమౌళి చేస్తున్న 'వారణాసి' విషయంలో మాత్రం పరిస్థితి మారినట్లు కనిపిస్తోంది. గతంలో 'బాహుబలి' మొదటి భాగం నైజాం హక్కులను దిల్ రాజు దాదాపు రూ. 25 కోట్లకు కొనుగోలు చేశారు. ఆ సినిమా భారీ విజయం సాధించడంతో మంచి లాభాలు వచ్చాయి. అయితే రెండో భాగం హక్కులను మాత్రం ఆయన తీసుకోలేదు. అప్పట్లో సునీల్ నారంగ్ దాదాపు రూ. 50 కోట్లకు నైజాం రైట్స్ దక్కించుకున్నారు. మొదటి భాగం కంటే రెట్టింపు ధర కావడంతో దిల్ రాజు ఆ డీల్‌కు దూరంగా ఉన్నారు. ఆ తర్వాత '===' విషయంలో దిల్ రాజు మళ్లీ ముందుకొచ్చారు. ఎన్టీఆర్, రామ్ చరణ్ కలిసి నటించిన ఆ సినిమా నైజాం హక్కులను భారీ ధరకు తీసుకున్నారు. విడుదల తర్వాత నైజాంలోనే రూ. 100 కోట్లకు పైగా షేర్ రావడంతో ఆయనకు మంచి లాభాలు దక్కాయి. దీంతో రాజమౌళి సినిమాల విషయంలో దిల్ రాజుకు మంచి అనుభవం ఉంది. ఇప్పుడు 'వారణాసి' రైట్స్ కోసం కూడా ఆయన పోటీలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈసారి మైత్రీ మూవీ మేకర్స్ భారీ ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కుల కోసం ఏకంగా రూ. 290 కోట్ల డీల్ కుదిరిందని ప్రచారం జరుగుతోంది.





మరికొన్ని రిపోర్ట్స్‌లో ఈ మొత్తం రూ. 300 కోట్లుగా ఉంది. దిల్ రాజుతో పాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కూడా పోటీపడినట్లు తెలుస్తోంది. చివరకు మైత్రీ సంస్థే ముందున్నట్లు వార్తలు వస్తున్నా ఈ డీల్‌పై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. మైత్రీ మూవీ మేకర్స్ ఇప్పటికే ప్రొడక్షన్‌లో మంచి సక్సెస్ లు అందుకుంది. ఇప్పుడు ఇతర నిర్మాతల పెద్ద సినిమాలను డిస్ట్రిబ్యూట్ చేయడంలోనూ భారీ పెట్టుబడులు పెడుతోంది. అయితే 'వారణాసి' డీల్స్ మామూలుగా లేవు. '===' తెలుగు రాష్ట్రాల హక్కులు దాదాపు రూ. 225 కోట్లకు అమ్ముడవగా, ఈసారి అంతకంటే రూ. 65 కోట్లకు పైగా ధర పలుకుతున్నట్లు సమాచారం. ఇంత పెట్టుబడి తిరిగి రావాలంటే తెలుగు రాష్ట్రాల్లోనే భారీ వసూళ్లు సాధించాలి. మహేష్ బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న తొలి సినిమా కావడంతో 'వారణాసి'పై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా నటిస్తున్న ఈ చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న విడుదల చేయనున్నారు. కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాకు ఇతర భాషల్లోనూ భారీ బిజినెస్ జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

300 కోట్ల క్లబ్‌లో టాప్ -5 హిందీ హీరోలు

బాలీవుడ్‌లో 300 కోట్ల క్లబ్‌లో పలుమార్లు చేరిన హీరోల జాబితాలో రణ్‌వీర్ సింగ్, రణ్‌బీర్ కపూర్, సల్మాన్ ఖాన్ ముందున్నారు. ఈ ముగ్గురూ



మూడేసి విజయాలు అందుకోగా, షారుఖ్ ఖాన్, అమీర్ ఖాన్, సన్నీ డియోల్ రెండేసి చిత్రాలతో ఈ క్లబ్‌లో నిలిచారు. విక్కీ కౌశల్ కూడా ఛావాతో ఈ జాబితాలో చేరారు. రామాయణ, ధురంధర్ వంటి ఫ్రాంచైజీల విజయాలతో ఈ వసూళ్ల రేసు మరింత ఆసక్తికరంగా మారింది. ఒకప్పుడు 100 కోట్ల క్లబ్ గురించి చాలా చర్చ సాగేది. కానీ ఇటీవలి కాలంలో 500 కోట్ల క్లబ్, 1000 కోట్ల క్లబ్ అంటూ లెక్కలు మారిపోయాయి. 2000-3000 కోట్ల మధ్య వసూలు చేస్తున్న పాన్ ఇండియన్ సినిమాలు ప్రపంచం దృష్టిని గొప్పగా ఆకర్షిస్తున్నాయి. అయితే నికర వసూళ్లలో 500 కోట్ల క్లబ్ లలో ఇంకా పూర్తిగా స్థిరపడిపోలేదు. కంటిన్యూగా ఈ రేంజు వసూళ్లు ఎవరి వల్లా కావడం లేదు. దేశంలో బడా హీరోలుగా పేరున్న హిందీ హీరోలకు కూడా ఇంకా ఆ స్థాయి సుస్థిరమైన స్టామినా లేదు. వరుసగా 4-5 సినిమాలు ఈ క్లబ్ ని అందుకోవడం సులువు కాదు. బాలీవుడ్ స్టార్లలో ఇప్పటివరకూ రణవీర్ సింగ్, రణబీర్ కపూర్, సల్మాన్ ఖాన్ మూడేసి చొప్పున 300 కోట్ల క్లబ్ సినిమాల్లో నటించగా, ఆ తర్వాత షారుఖ్ ఖాన్, అమీర్ ఖాన్ సన్నీడియోల్ రెండేసి చొప్పున 300 కోట్ల క్లబ్ లను అందుకున్నారు. ఇటీవలే దురంధర్ ఫ్రాంచైజీతో రణవీర్ సింగ్ రికార్డులు తిరగరాసాడు. అతడి కెరీర్ లో పద్మావత్, సింబా, దురంధర్ చిత్రాలు 300 కోట్ల క్లబ్ లను అందుకున్నాయి. ప్రతి సినిమాలో వైవిధ్యమైన నటనతో కట్టి పడేసిన రణ్ వీర్ క్రేజ్ గ్లోబల్ స్థాయిలో పెరిగింది. ఇప్పుడు రణబీర్ కపూర్ రామాయణ ఫ్రాంచైజీతో సంచలనం సృష్టిస్తున్నాడు. ఈ ఫ్రాంచైజీలో పార్ట్ 1 ఇప్పటికే 750 కోట్ల వసూలు చేసి 300 కోట్ల క్లబ్ ని అధిగమించింది. అంతకుముందు యానిమల్, సంజు చిత్రాలతో అతడు ఈ ఫీట్ ని అందుకున్నాడు. ఆ ఇద్దరితో పాటు కండల హీరో సల్మాన్ ఖాన్ మూడు సార్లు 300 కోట్ల క్లబ్ లను అందుకున్నాడు. అతడు నటించిన భజరంగీ భాయిజాన్, సుల్తాన్, టైగర్ జిందా హై చిత్రాలతో ఇది సాధ్యమైంది. మరోవైపు కింగ్ ఖాన్ షారూఖ్, మిస్టర్ పర్ఫెక్ట్ అమీర్ ఖాన్, సన్నీడియోల్ లాంటి సీనియర్లు కూడా రెండేసి చొప్పున 300 కోట్ల క్లబ్ లను అందుకున్నారు. షారూఖ్ నటించిన పఠాన్, జవాన్ చిత్రాలు ఈ ఫీట్ ని అందుకున్నాయి. అలాగే నిజానికి అమీర్ ఖాన్ పీకే చిత్రంతో తొలి 300 కోట్ల క్లబ్ ని బాలీవుడ్ కి అందించాడు. అతడు నటించిన స్పోర్ట్స్ డ్రామా దంగల్ ఇండియా, చైనాలో అద్భుత విజయం సాధించింది. ఈ చిత్రం 2000 కోట్లు వసూలు చేసింది. మరో బాలీవుడ్ సీనియర్ హీరో సన్నీడియోల్ సైతం 300 కోట్ల క్లబ్‌లో ఉన్నాడు. అతడు నటించిన గదర్ 2, బార్డర్ 2 చిత్రాలు అఖండ విజయం సాధించి 300 కోట్ల క్లబ్ లను అధిగమించాయి. అయితే ఈ జాబితా మునుముందు మరింత పెరగనుంది. విక్కీ కౌశల్ ఇప్పటికే -చావా- సినిమాతో 300 కోట్ల నికర వసూళ్ల క్లబ్ లో చేరాడు. బాలీవుడ్ లోను యువతరం హీరోలు దూసుకొస్తున్నారు గనుక 300 కోట్ల క్లబ్ లు మరింత పెరిగే ఛాన్సుంది. ఫుల్ రన్ లో గ్రాస్ వసూళ్లను పరిశీలిస్తే.... రణ్‌బీర్ కపూర్ నటించిన యానిమల్ ఫుల్ రన్ లో -917.76 కోట్లు, రామాయణ్ -పార్ట్ వన్ 750o కోట్లు, సంజు 586.85 కోట్లు వసూలు చేయగా, రణ్‌వీర్ సింగ్ నటించిన ధురంధర్ 1,350 కోట్లు, పద్మావత్ 585 కోట్లు, సింబా 400o కోట్లు వసూలు చేసాయి. సల్మాన్ ఖాన్ నటించిన బజరంగీ భాయిజాన్ 969 కోట్లు, సుల్తాన్ 614.49 కోట్లు, టైగర్ జిందా హై 565.10 కోట్లు కలెక్ట్ చేసాయి. షారుఖ్ ఖాన్ నటించిన జవాన్ 1,148.32 కోట్లు, పఠాన్ 1,050.30 కోట్లు వసూలు చేయగా, సన్నీ డియోల్ నటించిన గదర్ 2 691.08 కోట్లు, బోర్డర్ 2 చిత్రం -464.5 కోట్లు వసూలు చేసాయి. ఆమిర్ ఖాన్ నటించిన దంగల్ 2,024 కోట్లు, పీకే 769.89 కోట్ల వసూళ్లతో రికార్డులు తిరగరాసాయి.

రౌడీ బాయ్ 'రౌడీ జనార్ధన' ఈ ఏడాది లేనట్టేనా?

టాలీవుడ్ సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా 'రణబాలి'కి మంచి కామెంట్స్ అందుకుంది కానీ అనుకున్న రేంజ్ బాక్సాఫీస్ సక్సెస్ కాలేదు. దీనితో ఇక అన్ని అంచనాలు నెక్ట్స్ సినిమా 'రౌడీ జనార్ధన' పై వినిపించాయి. యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు రవికిరణ్ కోలా తెరకెక్కిస్తున్న ఈ ఇంటెన్స్ యాక్షన్ డ్రామా పట్ల గట్టి అంచనాలు ఉన్నాయి. తెలుగు సినిమా విడుదలలుఅయితే ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్న ఫ్యాన్స్ కి మేకర్స్ మొదట ఈ సినిమాని కూడా ఈ ఏడాదిలోనే విడుదలకి ఖరారు చేశారు కానీ ఇప్పుడు ఈ ఏడాదిలో రిలీజ్ కష్టం లానే కనిపిస్తుంది. ఆల్రెడీ ఏడాది పూర్తి కావస్తుంది. దాదాపు అన్ని స్లాట్స్ లో కూడా పలు సినిమాలు లాక్ అయ్యాయి. దీనితో ఇంత తక్కువ టైం లో ఈ సినిమా రావడం ఒకింత కష్టమే అనుకోవచ్చు. మరి వీటితో రౌడీ జనార్ధన ఎప్పుడు వస్తాడో చూడాలి. ఇక ఈ చిత్రంలో కీర్తి సురేష్ హీరోయిన్ గా నటిస్తుండగా దిల్ రాజు నిర్మాణం వహిస్తున్నారు.



Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197